హైదరాబాద్ వార్త



# జీరో బిల్లు కట్..!



- భారీగా గృహ విద్యుత్ వినియోగం
- గిర్రున తిరుగుతున్న ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు
- సబ్సిడీ పోయి ..వేలల్లో బిల్లులు
- పొదుపుగా వాడుకోవాలని సూచిస్తున్న అధికారులు

**హైదరాబాద్,మే 22,ప్రభాతవార్త:** వేసవికాలం పగటి ఉష్ణోగ్రతలు ఇప్పటికే 43డిగ్రీలు దాటింది. మండుతున్న ఎండలకు ఉక్క పోత తోడైంది. ఉపశమనం కోసం సిటిజన్లు పేద, మధ్య తరగతి కుటుంబాలు సైతం ఏసీలు, కూలర్లు వాడుతున్నారు. ఇప్పటికే రిఫ్రిజిరేటర్, వాటర్ హీటర్, మిక్సీ, టీవీ, ఫ్యాన్ వాడకంతో నెలకు 120 నుంచి 150 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించేవారు. తాజాగా ఏసీలు, కూలర్లు వినియోగించనుండటంతో మీటర్ రీడింగ్ గిర్రున తిరుగుతుంది. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి ప్రభుత్వం 2024 మార్చి నుంచి జీరో విద్యుత్ బిల్లులు (గృహజ్యోతి పథకం) జారీ చేస్తున్న విషయం తెలిసిందే. గ్రేటర్లో 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 10,03,286 కనెక్షన్లు మాత్రమే జీరో బిల్లుకు అర్హత పొందారు. వీరు ప్రతి నెలా 89.39 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుండగా, ఇందుకు సంబంధించిన రాయితీ మొత్తం రూ.38.62 కోట్లు ప్రభుత్వం డిస్కంకు చెల్లిస్తోంది. అయితే గత ఏప్రిల్ నెల నుంచి విద్యుత్ వాడకం 200 యూనిట్లు దాటి దాదాపు 300నుంచి 350 యూనిట్లకు చేరుకుని వేలల్లో బిల్లులు వస్తున్నాయి. దీనికి కారణం ఏసిలు, కూలర్లు నిర్విరామంగా తిరగడటం అని విద్యుత్ అధికారులు అంటున్నారు.

**పొదుపుగా వాడితేనే..**

ప్రస్తుతం దాదాపు అన్ని ఇళ్లలో ఎల్ఈడీ బల్బులు వినియోగిస్తున్నారు. ఇప్పటికీ కొందరు పాత కాలం ఫ్లోరోసెంట్ ట్యూబ్‌లైట్లే వాడుతున్నారు. వీటి సామర్థం 40 వాట్స్ ఉండడంతో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశముంది. దీని దృష్ట్యా ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లు మేలు.ఏసీలు 24 నుంచి 29 డిగ్రీల మధ్య ఉపయోగిస్తేనే చల్లదనంతో పాటు బిల్లు ఆదా అవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఇన్వర్టర్‌తో కూడిన ఏసీలు అందుబాటులో ఉన్నాయి. గది చల్లబడగానే ఆటోమెటిక్‌గా ఏసీ ఆగిపోతుంది. వీటితో కొంత విద్యుత్తు వినియోగం తగ్గే అవకాశముంది. సాధారణ ఏసీలు కరెంటు పోయి వచ్చినప్పుడు పునఃప్రారంభమయ్యే సమయంలో లోడ్ పెరిగిపోతుంది. ఇది విద్యుత్తు సరఫరా వ్యవస్థపై భారం పడుతుంది.వేసవికి ముందే ఏసీలను మెకానిక్‌తో తనిఖీ చేయించాలి. ఫిల్టర్లు శుభ్రం చేయించడంతోపాటు గాలి ఫ్లోటింగ్‌ను పరిశీలించాలి. సీజన్ మేరకు ఫ్రిజ్‌లో ఫ్రీజర్ దశలు మారుస్తూ ఉండాలి. వేసవిలోఎక్కువ ఉంచినా మిగిలిన కాలాల్లో తగ్గించుకోవాలి. మంచు పొరలు పావు వంతు పెరిగినట్లు గమనిస్తే వెంటనే డీఫ్రాస్ట్ అనే ఆప్షన్‌తో తొలగించాలి.ఏసీలు,ఫ్యాన్లు, కూలర్లు, ఎల్ఈడీ బల్బులు, రిఫ్రిజిరేటర్లు తదితర విద్యుత్తు గృహోపకరణాలు బీఈఈ రేటింగ్ 1 నుంచి 5 స్టార్లతో విక్రయిస్తున్నారు. వీటిలో5 స్టార్ ఉంటే విద్యుత్ వినియోగం తగ్గి బిల్లు ఆదా అవుతుంది. అవసరం లేని సమయంలో కంప్యూటర్లు, టీవీలు, ఫ్యాన్లు స్విచ్ఛాఫ్ చేయాలి. ఫోన్ ఛార్జింగ్ పూర్తయ్యాక ఛార్జర్‌ను ప్లగ్ నుంచి తొలగించాలి.

# ఉప్పల్‌లో సిక్సర్ల మోత





-బ్లాక్‌లో టిక్కెట్ల విక్రయాలు -మ్యాచ్‌కు పోటెత్తిన ప్రేక్షకులు



**ఉప్పల్, మే 22 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం జరిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు మ్యాచ్‌కు ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. ఈ సీజన్‌లో హైదరాబాద్‌లో ఇదే చివరి మ్యాచ్ కావడంతో విఐపిలు, రాజకీయ నేతలు భారీగా తరలివచ్చారు. ఈ మ్యాచ్‌లో బెంగుళూరు జట్టు నుంచి విరాట్ కోహ్లీ రానుండడంతో మ్యాచ్‌కు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు కాంప్లమెంటరీ టిక్కెట్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించారు. సన్‌రైజర్స్ ఒపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ క్రీజ్‌లో రావడంతో ప్రేక్షకులు కేరింతలు కొడుతూ స్వాగతం పలికారు. శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కాగా మధ్యాహ్నం 12 గంటల నుంచే ప్రేక్షకులు స్టేడియం వద్దకు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో స్టేడియం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐపిఎల్ మ్యాచ్ సందర్భంగా ఉప్పల్ వైపు భారీ వాహనాలను మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 12 వరకు అనుమతించలేదు. నాగోల్ హబ్సిగూడ, బోడుప్పల్‌అంబర్‌పేట మార్గాల్లో ట్రాఫిక్ మళ్లించారు. భారీ వాహనాలను ఉప్పల్ జంక్షన్ వైపు అనుమతించలేదు. వరంగల్ నుంచి వచ్చే భారీ వాహనాలు ఘట్కేసర్ వద్ద ఓఆర్ఆర్ పైకి, తార్నాక నుంచి వచ్చే వాహనాలను హబ్సిగూడ ఎక్స్ రోడ్ వద్ద నాచారం మీదుగా, ఎల్బీనగర్ వైపు వచ్చే వాహనాలను నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద బోడుప్పల్, చెంగిచెర్ల వైపు మళ్లించారు. ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ప్రేక్షకులు మెట్రో లేదా ఆర్టీసీ బస్సులను రాత్రి 12 గంటల వరకు నడిపించారు.

**బ్లాక్ మార్కెట్‌లో యథేచ్ఛగా టిక్కెట్ల విక్రయాలు :** ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం జరిగే మ్యాచ్‌కు యథేచ్ఛగా బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయించారు. పోలీసులు పలు చోట్ల గస్తీ ఏర్పాటు చేసినా స్టేడియం బయట కొందరు టిక్కెట్లు విక్రయించారు. కాంప్లమెంటరీతోపాటు, ఇతర టిక్కెట్లు ముందుగానే తమ వద్ద ఉంచుకుని విక్రయాలు చేశారు. స్టేడియంలో మొత్తం సామర్థం 39 వేల సీట్లు. ఇందులో విఐపిలు, అధికారులకు ఇచ్చే ఉచిత కాంప్లిమెంటరీ పాసులు కాకుండా సుమారు 30 నుండి 32 వేల టికెట్లు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచాలి. కానీ, ఆన్‌లైన్ సేల్స్ ప్రారంభం కాగానే దాదాపు 3 లక్షల మందిని క్యూలో చూపించి, అసలు టికెట్లు బుక్ చేసుకునే లోపే వేలాది టికెట్లు కంటికి కనిపించకుండా మాయమైపోయాయి. అసలు ధర రూ.950గాగా ఉన్న సాధారణ టికెట్లను బ్లాక్ లో రూ. 10 వేల నుండి రూ. 20 వేల వరకు అమ్ముతుండగా, రూ. 10 వేల విలువైన కార్పొరేట్ బాక్స్ టికెట్లను ఏకంగా రూ.1 లక్ష వరకు విక్రయించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# జవహర్‌నగర్ డంప్ యార్డ్ సమస్యలపై సమీక్ష

-శాశ్వత పరిష్కారంపై ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టి



**జవహర్ నగర్, మే 22.ప్రభాతవార్త.** జవహర్ నగర్ డంప్ యార్డ్ సమస్యలపై నిన్న జరిగిన అఖిలపక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు జవహర్ నగర్ డంప్ యార్డ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. అనంతరం హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ ప్లాంట్ వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రామ్‌కీ సంస్థ అనుసరిస్తున్న వ్యర్థ నిర్వహణ విధానాలు, కాలుష్య నియంత్రణ చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. జవహర్ నగర్ ప్రాంతంలో నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు ఏర్పాటు చేసిన ఎస్టీపీ ప్లాంట్ సక్రమంగా పనిచేయకపోవడంపై ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రామ్‌కీ సంస్థపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సీఎస్ఆర్ నిధులను స్థానిక ప్రజల అభివృద్ధికి వినియోగిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని సూచించారు. ప్రస్తుతం తక్కువ మొత్తంలోనే సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేస్తున్నారని, దాని వల్ల ప్రజలకు తాగునీరు, సరైన వైద్య సదుపాయాలు అందడం లేదని పేర్కొన్నారు.మూడు మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి రోజుకు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల చెత్త జవహర్ నగర్ డంప్ యార్డ్‌కు తరలివస్తుండటంతో సమస్య తీవ్రంగా మారిందని తెలిపారు. దీనికి దీర్ఘకాలిక పరిష్కారంగా హైదరాబాద్ నగరానికి నాలుగు వైపులా కొత్త డంప్ యార్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్త మొత్తం జవహర్ నగర్‌కు రావడం తగ్గుతుందని అధికారులు వివరించారు.ప్రజాప్రతినిధులు, అధికారులు, రామ్‌కీ సంస్థ ప్రతినిధులు మరోసారి సమావేశమై సమగ్ర నివేదిక రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, పారిశుధ్య అదనపు కమిషనర్ రఘుప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, జవహర్ నగర్ మాజీ మేయర్లు కావ్య, శాంతి కోటేష్ గౌడ్.రాగిడి లక్ష్మారెడ్డి, జవహర్ నగర్ బి ఆర్ ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్. మాజీ కార్పొరేటర్లు బింగి లావణ్య సతీష్ గౌడ్. జిట్టా శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి. మాజీ ఎంపిటిసి రంగుల సతీష్. యాంటీ డంప్ యార్డ్ జేఏసీ సభ్యులు, రామ్‌కీ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

## లారీని ఢీకొట్టిన కారు...ఒకరు మృతి



**అత్తాపూర్ మే22,ప్రభాతవార్త :** ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఎస్సై రాఘవేందర్ వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ పరిధిలోని భవాని కాలనీలో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రభాత్ కుమార్ ఝూ (35) శుక్రవారం రాయ దుర్గంలోని సిట్కో కార్యాలయానికి హిమయాత్ సాగర్ ఓఆర్ఆర్ మీదుగా గచ్చిబౌలి వైపు వ్యాగన్‌ఆర్ కారులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై నిలిచి ఉన్న లారీని వెనుక వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో కారు ఉన్న ప్రభాత్ కుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## డిప్రెషన్‌తో యువకుడు ఆత్మహత్య

-ఇన్‌స్టాగ్రామ్ ద్వారా యువతితో ప్రేమ సంబంధం

-మూడు నెలల క్రితం ఆ యువతి దూరం

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త:** డిప్రెషన్ తో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం... నాగోలు 30 అన్నారంలో నివాసం ఉండే పాండుగాయల సుబ్బారావుకు ఇద్దరు కుమారులు. ప్రైవేటు ఉద్యోగం చేసే పెద్ద కుమారుడు పి.తిరుమల్( 24)కు మూడు సంవత్సరాల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన ఒక యువతితో తిరుమల్ ప్రేమ సంబంధం కొనసాగించాడు. అనంతరం ఇరు కుటుంబాల ఒప్పందం మేరకు వారిద్దరికీ వివాహం కూడా జరిగింది. కాగా సుమారు మూడు నెలల క్రితం ఆ యువతి తిరుమల్‌ను దూరం పెట్టి, ఇకపై సంబంధం కొనసాగించలేనని వెళ్లిపోయింది. దీంతో తిరుమల్ మానసికంగా కలత చెంది డిప్రెషన్‌కు గురయ్యాడు. కాగా గురువారం రాత్రి ఇద్దరు కుమారులు కలిసి భోజనం చేసి తమ గదుల్లో నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారుజామున సుమారు 5.30 గంటలకు తిరుమల్ గది తలుపు తట్టగా స్పందన లేకపోవడంతో తలుపు బద్దలు కొట్టి చూడగా తిరుమల్ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడు. వెంటనే మృతుడి తండ్రి నాగోల్ పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశాడు. తన కుమారుడి మరణానికి పై సంఘటనే కారణమని అనుమానం ఉందని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.

### హుస్సేన్ సాగర్‌లో గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యం

**బేగంపేట మే 22,ప్రభాతవార్త**

హుస్సేన్ సాగర్ (ట్యాంక్‌బండ్) నీటిలో ఒక గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైంది.శుక్రవారం సాయంత్రం గం 4ల ప్రాంతంలో లేక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది సాగర్ తీరంలో గాలిస్తుండగా యువతి శవం కొట్టుకు రావడం గమనించారు.మృతి చెందిన యువతి వయసు సుమారు 20 నుంచి 25సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న లేక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసారు.మృతి చెందిన యువతికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు.నగరంలోని ఇతర ప్రాంతాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎవరైనా ఈ వయసు గల యువతులు అదృశ్యమైనట్లు మిస్సింగ్ కేసులు నమోదై ఉంటే తక్షణమే తమ (లేక్)పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్‌హెచ్‌ఓ కోరారు.సమాచారం తెల్సిన వారు లేక్ పోలీస్ ఎస్‌హెచ్‌ఓ 8712661598కు ఫోన్ చేసి వివరాలు అందించాలని విజ్ఞప్తి చేసారు.

## నేటి నుంచే అగ్రివర్సిటీ నాణ్యమైన విత్తనాల విక్రయాలు ప్రారంభం

-ఉపకులపతి ప్రొ. అల్దాస్ జానయ్య

**అత్తాపూర్ మే22 ,ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ పరిశోధనా, రైతు విజ్ఞాన మరియు కృషి విజ్ఞాన కేంద్రాలలోని క్షేత్రాలలో శాస్త్రవేత్తల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉత్పత్తి చేసిన నాణ్యమైన మూల విత్తనాన్ని విశ్వవిద్యాలయం వివిధ జిల్లాలలో ఏర్పాటు చేసిన (27) విక్రయ కేంద్రాలలో ఈ నెల 23 నుండి 30 వరకు నిర్వహించే "విత్తన వారోత్సవాలలో" భాగంగా సిద్ధంగా ఉంచిన సుమారు 1230 టన్నుల విత్తన విక్రయాలు నేటి (శనివారం)నుంచి ప్రారంభమవుతాయని వర్సిటి ఉపకులపతి ప్రొ. అల్దాస్ జానయ్య ఒక ప్రకటనలో తెలియచేసారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు రాజేంద్రనగర్లో లాంచనంగా ప్రారంభిస్తారు. కావున ఈ నెల 18 నుండి 23 వరకు అడ్వాన్స్ బుకింగ్ చేసుకొన్న రైతులు పట్టికలో చూపించిన ఆయా విక్రయ కేంద్రాల నుండి విత్తనాలను తీసుకెళ్ళాలని ఉపకులపతి రైతులను కోరారు. అదేవిధంగా అడ్వాన్స్ బుకింగ్ చేసిన రైతులకు విత్తనాలు విక్రయించగా మిగిలిన విత్తనాన్ని ఇతర రైతులకు ఆయా కేంద్రాల వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉంటాయని తెలిపారు. విత్తన కొనుగోలుకు విత్తన లభ్యతను సంబంధిత కేంద్రాల ఇన్చార్జ్ నుండి ముందస్తుగా సమాచారం తెలుసుకొని అడ్వాన్స్ బుకింగ్ చేయని రైతులు ఆయా కేంద్రాలకు కొనుగోలుకు వెళ్ళాలని సూచించారు.ప్రతి రైతు, సంబంధిత విక్రయ కేంద్రాల నుండి విత్తనం కొనుగోలు చేసేటప్పుడు విశ్వవిద్యాలయ అధికారిక రశీదుతో పాటు సంబంధిత సాంకేతిక పత్రాన్ని విధిగా ఆయా శాస్త్రవేత్తల నుండి పొందాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ విక్రయ కేంద్రాలలో సంయమనం పాటిస్తూ విత్తనాలు కొనుగోలు చేయాలని కోరారు.

## అమ్మతనాన్ని, సృజనాత్మకతను గౌరవించుకోవడం మన బాధ్యత



పురస్కారాలను ప్రధానం చేస్తున్న డాక్టర్ కె.వి. రమణాచారి

**చిక్కడపల్లి మే 22 ( ప్రభాతవార్త ) :** అమ్మతనాన్ని, సృజనాత్మకతను గౌరవించుకోవడం మన బాధ్యత అని ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ని కళాసుబ్బారావు కళావేదికలో ప్రముఖ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ అభినందన 40 ఏళ్ళ పండగ ఉత్సవాలలో భాగంగా మాతృదినోత్సవం మాతృవందనం" పేరిట ప్రముఖ రచయిత్రి జలంధర చంద్రమోహన్ కు ప్రతిష్టాత్మక మాదిరాజు వరలక్ష్మి పురస్కారం (అభినందన భవాని మాతృమూర్తి) ప్రధానం నిర్వాహక సంస్థ అధినేత్రి డాక్టర్ ఈ.భవాని నిర్వహణలో అధికారభాష సంఘం పూర్వ అధ్యక్షుడు పి.విజయబాబు జరిగిన సభకు ముఖ్య అతిధిగా హాజరైన డాక్టర్ కెవి.రమణాచారి పురస్కారాన్ని ప్రధానం చేసి ప్రసంగించారు.అవార్డు గ్రహీత జలంధర చంద్రమోహన్ తన రచనల ద్వారా సమాజానికి ఎంతో స్ఫూర్తినిచ్చారని, అలాగే లక్ష్మీ సుందరం కళారంగానికి చేసిన సేవలు ప్రశంసనీయమని ఆయన అన్నారు. ప్రముఖ నాట్య కళాకారిణి, విశాఖ మాతృమూర్తి అయిన లక్ష్మీ సుందరం కు మాతృవందనం పేరుతో సత్కరించారు. సభలో ప్రముఖ రచయిత్రి డా. ముక్తేవి భారతీదేవి, సీనియర్ సంపాదకులు ఎ.ఎస్. లక్ష్మి తదితరులు పాల్గొనగా మహేశ్వరి చే కూచిపూడి నృత్య ప్రదర్శన, అలాగే శ్రీమతులు శోభబారు, జె. యిందిర, ఎ. శారద, డి. లలిత, కుమారి నవ్యయామినిలచే లలిత గీతాలు, సినీ గీతమాలిక వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు మాయం...

-బోర్డు తొలగింపుపై పలు అనుమానాలు..

-రెవిన్యూ సిబ్బంది సహకారం ఉన్నట్లు ఆరోపణలు...?



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు (పసుపు వృత్తంలో)



బోర్డు తొలగించిన దృశ్యం(ఎరుపు వృత్తంలో)

**దుండిగల్, మే 22 ప్రభాతవార్త:** ప్రభుత్వ స్థలంలో రెవిన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు మాయం అవుతున్నాయి. మీరు బోర్డులు ఏర్పాటు చేస్తే మేము మాయం చేస్తాం అంటూ కబ్జారాయుళ్ళు అధికారులకు సవాల్ విసురుతున్నారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధాన రహదారి వెంట ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు విశ్వప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో రెవిన్యూ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో స్పందించిన అధికారులు ప్రభుత్వ స్థలం అని ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తొలగించడం చర్చనీయాంశంగా మారింది. అయితే రెవిన్యూ విభాగంలో కిందిస్థాయి సిబ్బంది పలువురి సహాకారంతోనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నట్లు స్థానికంగా వినికిడి. వివరాల్లోకి వెళితే గండిమైసమ్మ దుండిగల్ మండలం, దొమ్మరపోచంపల్లి సర్వేనంబర్ 120/11లో 3 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇందులో వసతి గృహాల కోసం ట్రైబల్ వెల్ఫేర్‌కు 02.25 ఎకరాలు కేటాయించారు. మిగతా 15 గుంటల స్థలంపై స్థానికంగా ఉన్న కొందరూ పాత దస్తావేజులను అడ్డం పెట్టుకొని కబ్జాలకు యత్నిస్తున్నారు. గండిమైసమ్మ-మేడ్చల్ ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈస్థలం గజం రూ,50వేలకు పైగా పలుకుతుండడంతో ఏలాగైనా స్థలం కాజేయాలనే దురుద్దేశ్యంతో పక్కన ఉన్న సర్వేనంబర్ 127 పట్టా స్థలం పేరుతో పలు షెడ్లను నిర్మించి చిరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. గతంలో ప్లాట్లుగా చేయడంతో మేము కొనుగోలు చేశాం సహకరించండి అంటూ పలువురు దస్తావేజులతో అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులను కలిసి విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. దీంతో ప్లాటుకు రూ,15లక్షలు ముట్టజెప్పితే సహకరిచేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలపడంతో అంగీకరించిన పలువురు ఇప్పటికే సుమారు రూ,60 లక్షలకు పైగా ముట్టజెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా పట్టా స్థలం పేరుతో ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు, వసూళ్ళ పర్వంపై ఉన్నతాధికారులతో పాటు మండల తహాసీల్దార్‌కు ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తడంతో పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ ఆయన తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో సర్వే చేసిన సిబ్బంది సదరు స్థలం 120/11 ప్రభుత్వ స్థలంగా నివేదిక అందజేయడంతో వెంటనే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని తహాసీల్దార్ ఆదేశాలు జారీ చేయడంతో జిపివో సందీప్ సిబ్బందితో కలిసి ప్రభుత్వ స్థలం అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ఇప్పుడు కనిపించడం లేదు. బోర్డు తొలగించి మూడు రోజులు గడుస్తున్న ఎటువంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

**హెచ్చరిక బోర్డు తొలగింపుపై వెల్లువెత్తుతున్న అనుమానాలు...**

దొమ్మరపోచంపల్లి సర్వేనంబర్ 120/11 ప్రభుత్వ స్థలంలో రెవిన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తొలగింపుపై స్థానికంగా అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బోర్డు తొలగించి మూడు రోజులు గడుస్తున్న తమకు ఎటువంటి సమాచారం లేదని రెవిన్యూ సిబ్బంది పేర్కొనడం స్థానికంగా వినిపిస్తున్న అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. బోర్డు తొలగింపు వెనుక రెవిన్యూ సిబ్బంది హస్తం ఉన్నట్లు తెలుస్తుంది. గల్లీలో జరుగుతున్న ఆక్రమణలను గుర్తించే సిబ్బందికి నిత్యం రాకపోకలు సాగించే రహదారి పక్కన ఏర్పాటు చేసిన బోర్డు తొలగింపు తెలియపోవడం విడ్డూరమే. పై అధికారులను తప్పుదోవ పట్టిస్తూ సర్వేనంబర్ 120లో ప్రభుత్వ నిబంధనలతో పనిలేకుండా వారి ప్రత్యేక నిబంధనలు నడిపించే సిబ్బంది చేతివాటమే అనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలకు సహకరిస్తున్న సిబ్బందిపై, ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**చర్యలు కఠినంగా ఉంటాయి**

**: తహాసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి**

ఇదే విషయమై తహాసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా ఈవిధంగా స్పందించారు. ప్రభుత్వ స్థలంలో బోర్డు తొలగింపుపై విచారణ జరుపుతున్నాము. బాధ్యులు ఎంతటివారైన ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలంలో వెంటనే మరో బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆక్రమణల విషయంలో మా సిబ్బంది సహాకరిస్తున్నంటూ గుర్తిస్తే ఉన్నతాధికారులకు నివేదిక పంపించి వారి ఆదేశానుసారం చర్యలు ఉంటాయని తెలిపారు.

## సిటీ కాలేజికి ప్రత్యేక జాతీయ గుర్తింపు



ప్రభుత్వ సిటీ కళాశాల

**చార్మినార్,మే 22 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ హరిత కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు గానుహైదరాబాద్ పాతబస్తీలో ఉన్న ప్రభుత్వ సిటీ కళాశాలకు ఫ్లాటినమ్ సస్టైనబుల్ క్యాంపస్ పార్ట్నర్స్ జాతీయ గుర్తింపులభించిందని ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్,ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ ఎన్విరాన్ మెంట్ ప్రోగ్రామ్-జాతీయ సుస్థిర క్యాంపస్ 2026లో భాగంగా ఈ అవార్డును ప్రకటించారని ఆయన తెలియజేశారు.ఈ ఏడాది ఏప్రిల్ నెల 22 నుంచి 29 వరకు నిర్వహించిన ధరిత్ర వారోత్సవాల సందర్భంగా సిటీ కళాశాలలో చేపట్టిన పర్యావరణ కార్యక్రమాలకుగాను ఈ గుర్తింపు దక్కిందని ఆయన తెలిపారు.ఈ ఉత్సవాలలో భాగంగా సిటీ కళాశాల క్యాంపస్‌లో ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అణుగుణంగా మొక్కలు నాటడం,నీటి పొదుపు,పరిశుభ్రత నిర్వాహణ,విద్యార్డులలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు సిటీ కాలేజికి ఈ అవార్డు లభించిందని ఆయన తెలియజేశారు.జూన్ నెల 1వ తేదీన హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరగబోయే సస్టైనబుల్ క్యాంపస్ ఇంపాక్ట్ సమ్మిట్,అవార్డ్స్ 2026 సదస్సుకు హాజరు కావలసిందిగా ఆహ్వానం అందిందని ఆయన తెలిపారు.ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించడంలో కీలక పాత్ర పోషించిన సిటీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.నాగరాజు,ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లను, స్వచ్ఛందంగా పాల్గొన్న విద్యార్డులను ప్రిన్సిపాల్ ప్రసాద్ అభినందించారు.

## సిఎం రిలీఫ్ చెక్కును అందించిన చిన్నారెడ్డి



లబ్ధిదారునికి సీఎంఆర్ చెక్కును అందజేస్తున్న చిన్నారెడ్డి

**చాంద్రాయణగుట్ట, మే 22, ప్రభాతవార్త :** హృద్రోగ వ్యాధితో బాధ పడుతున్న ఉప్పుగూడకు చెందిన రాజేందర్ కులకర్ణికి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన రూ.60వేల చెక్కును శుక్రవారం బేగంపేటలోని ప్రజాభవన్‌లో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న వేలాది మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినయోగం చేసుకుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.వెంకటేష్ తదితరులు హాజరైయ్యారు.

## గాంధీనికేతన్ బస్తీలో వాటర్‌లైన్ పనులు ప్రారంభం



మంచినీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించిన చంద్రమోహన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బస్తీవాసులు

**చాంద్రాయణగుట్ట, మే 22, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ చిత్తశుద్ధితో పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం గౌలిపురా డివిజన్ గాంధీనికేతన్ బస్తీలో సుమారు రూ.5లక్షల నిధులతో చేపట్టిన నూతన మంచినీటి పైప్‌లైన్ పనులను బస్తీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌడ్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా బస్తీవాసులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను జలమండలి ఎండి అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళినట్లు వెల్లడించారు. బస్తీ నాయకులు బోడ మల్లేష్ కుర్మ మాట్లాడుతూ మంచినీటి సమస్యపై స్థానిక ప్రజా ప్రతినిధుల వద్దకు ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోలేదన్నారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన సీపీఐ నేత చంద్రమోహన్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సమితి సభ్యులు ఎన్.ఆర్.శ్రీనివాస్‌రావు, డివిజన్ కార్యవర్గ సభ్యులు ఎన్.దిలీప్, ఏఐఎస్ఎఫ్ నాయకులు జి.వినీత్ గౌడ్, బస్తీవాసులు ఎన్.వినోద్, సంతోష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటాం : కిషోర్ రెడ్డి



బాధితుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**దుండిగల్, మే 22, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 296వ డివిజన్ దుండిగల్‌కు చెందిన కే. అశోక్ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న స్టేట్ ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి, బికెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, బికెఆర్ ఫౌండేషన్ ద్వారా ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం మాత్రమే కాకుండా, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని తెలిపారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు తమ ఫౌండేషన్ ద్వారా భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, దొంతి మహేష్, కృష్ణ యాదవ్, బికెఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



పురానాపూల్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేసిన గోల్కొండ జిల్లా బిజెపి నాయకులు

**జియాగూడ, మే22ప్రభాతవార్త:** అక్రమంగా తరలిస్తున్న గోవులను కాపాడిన గో రక్ష కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం ఎంత వరకు న్యాయమని గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు టి.ఉమామహేంద్ర ప్రభుత్వాన్నిప్రశ్నించారు. శుక్రవారం గోల్కొండ జిల్లా బిజెపి ఆధ్వర్యంలో పురానాపూల్ చౌరస్తా వద్ద గోరక్ష కార్యకర్తలపై అక్రమకేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ జిల్లా బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద పాల్గొన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు టి.ఉమామహేంద్ర మాట్లాడుతూ గోరక్ష కార్యకర్తలను వెంటనే బేషరత్తుగా విడుదలచేయాలని, హిందూ సంప్రదాయాలను అవమానించిన వారిపై కేసులు పెట్టాలని, ఏకంగా మజ్లీస్ ఎం.ఎల్.సి గోవులనువెంట ఉండి వాహనాలలో తరలిస్తున్న పోలీసులకు కనిపించడంలేదా అన్ని ప్రశ్నించారు. తెలంగాణలో గోవుల అక్రమ రవాణా వధను అరికట్టాలని, గోమాతనున రక్షించడం ప్రభుత్వ భాద్యత అన్నారు. గోవుల అక్రమ తరలిపు అరికట్టకుంటే గోరక్ష కార్యకర్తలు రంగంలోకి అడ్డుకుంటామన్నారు. బిజెపి సీనియర్ నాయకులు రమేష్‌లాల్‌యాదవ్, సోమ్‌రాజ్‌సింగ్, కట్టప్ప, నటరాజ్‌నామ్‌దారిలతో జిల్లా ప్రధాదికారులు పాల్గొన్నారు.



అలియాబాద్ రాజన్నబావి శ్రీ తుల్జాభవానీ దేవాలయంలో శుక్రవారం అమ్మవారు 13 చీరలు, నగలు, ఫల పుష్పాలతో దేదీప్యమానమైన రూపంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు రంగాచార్య కులకర్ణి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భవానీ మాతను దర్శించుకొని మొక్కులు సమర్పించుకున్నారు.
- చాంద్రాయణగుట్ట, మే 22, ప్రభాతవార్త

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సమస్యలు పరిష్కరిస్తున్నాం : ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట, మే 22,ప్రభాతవార్త**

ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పిస్తూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం రాంగోపాల్‌పేట డివిజన్ ఆవుల మంద లో రూ 12లక్షల వ్యయంతో చేపట్టిన సీవరేజ్ పైప్‌లైన్, కళాసీగూడాలో రూ 9.65 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ పైప్‌లైన్ పనులను మాజీ కార్పోరేటర్ అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్‌తో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాసీ గూడా లో స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కళాసీగూడా లోని నాలా వెంట వీధిలో ఉన్న సీవరేజ్ లైన్ దెబ్బతినడంతో పైప్‌ల సామర్థ్యం పెంచి నూతన పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పైప్ లైన్ పూర్తయిన అనంతరం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కాలనీలోని అన్ని అంతర్గత రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీలో స్ట్రీట్ లైట్లు సక్రమంగా వెలగడం లేదని, రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక



ఆవుల మందలో సీవరేజ్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలసాని.

మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటర్‌వర్క్స్ డీజీఎం శ్రీధర్, డీజీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈ చంద్రశేఖర్, హార్టికల్చర్ అధికారి రాజిరెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ రవికుమార్, ఎమ్మెల్యే వెంట మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి మల్లికార్జున్ గౌడ్, అత్తెల్లి అరుణ్ గౌడ్, కిరణ్మయి, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, కిషోర్, కోటేశ్వర్‌గౌడ్, సంజయ్, ఆకుల హరికృష్ణ, గందె నాగులు, శ్రీహరి, కొండాపురం మహేష్ యాదవ్, అరుణ్‌భట్, జనార్ధన్, గణేష్, అభిషేక్ కాలనీ వాసులు జగత్‌రావు, అనూక్, సన్నీ తదితరులు ఉన్నారు.

## వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీమత్ సుందరకాండ సప్తాహ్నిక యజ్ఞం

**చిక్కడపల్లి మే 22 ( ప్రభాతవార్త ) :** చిక్కడపల్లి స్థానిక వివేక్‌నగర్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో జూన్ 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు శ్రీమత్ సుందరకాండ సప్తాహ్నిక యజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించబోతున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం, ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతి శర్మ, అర్చకులు కందాళ వెంకటాద్రి వివరించారు. శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ యజ్ఞంలో భాగంగా శ్రీమత్ సుందరకాండ హోమముతో పాటు 108 పర్యాయములు శ్రీ హనుమాన్ చాలీసా హోమము, చండీ నవశతి హోమము, శ్రీ రుద్ర హోమము, హనుమత్ కార్యసిద్ధి హోమము, నవగ్రహ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. జూన్ 1 న ఉదయం 8 గంటలకు శ్రీ గణపతి పూజ, పుణ్యాహవాచనము, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, శ్రీమత్ సుందరకాండ హోమము. సాయంత్రం 6 గంటలకు ప్రదోషకాలపూజ, శ్రీరుద్రహోమము, రాజో పచార పూజ (చతుర్వేద అవధానాలు), 2న



వివరాలు వెల్లడిస్తున్న ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం,

శ్రీ హనుమత్ కార్యసిద్ధి హోమము, 3న నవగ్రహ హోమము, 4న మేధా దక్షిణామూర్తి , దత్తాత్రేయ హోమము, 5న శ్రీ చండీ సప్తశతి హోమము, 6న 108 పర్యాయ ములు శ్రీ హనుమాన్ చాలీసా హోమము, 7న పూర్ణా హుతి, మంటపోద్వాసన, మహదాశీర్వచనము, ఋత్విక్ సన్మానము, అతిథి సత్కారము, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులందరూ ఈ బృహత్ కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి దైవకృపకు పాత్రులు కావాలని కోరారు.

## కార్మికులకు గౌరవప్రదమైన కనీస వేతనాలు ఇవ్వాలి

**-ప్రభుత్వ నిర్ణయం గుడ్డిలో మెల్ల చందంగా ఉంది**

**-సీఎం రేవంత్ రెడ్డికి బండారు దత్తాత్రేయ బహిరంగ లేఖ**

**చిక్కడపల్లి మే 22 ( ప్రభాతవార్త ) :** రాష్ట్రంలో కనీస వేతనాల పేరిట కార్మికులను మోసం చేయవద్దని, వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని కేంద్ర కార్మిక శాఖ మాజీ మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఒక ప్రకటన విడుదల చేశారు. గత 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల అంశాన్ని ప్రభుత్వం తూతూమంత్రంగా పరిష్కరించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం పెంచిన వేతనాలు "గుడ్డిలో మెల్ల" అన్నట్లుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుత రోజుల్లో విద్యా, వైద్యం, ఇంటి అద్దెలు, రవాణా ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని దత్తాత్రేయ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన అరకొర వేతనాలు కార్మికుల జీవన అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో జీవన వ్యయం రోజురోజుకూ పెరుగుతున్నందున.. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ కార్మికులకు తగిన స్థాయిలో వేతనాలు నిర్ణయించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర జీడీపీ పెరుగుతున్నప్పుడు కార్మికుల ఆదాయం కూడా పెరగాలని దత్తాత్రేయ పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు ఒక కోటి 20 లక్షల మంది కార్మికులు కనీస వేతనాల పెంపు కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. "వేతనం అనేది వరం కాదు.. అది కార్మికుడి హక్కు" అని ఆయన స్పష్టం చేశారు. కార్మికుడి చెమటతోనే పరిశ్రమలు, నిర్మాణ రంగం, నగరాల అభివృద్ధి సాధ్యమవుతోందని, కేవలం భారీ భవనాలు, పెట్టుబడులు మాత్రమే అభివృద్ధి కావని.. కార్మికుని కుటుంబం గౌరవంగా జీవించడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు. కార్మికుల కేటగిరీలను బట్టి కనీస వేతనాలలో అన్ స్కిల్డ్ (నైపుణ్యం లేని) కార్మికులకు రూ. 22 వేలు, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ. 27 వేలు, స్కిల్డ్ (నైపుణ్యం గల) కార్మికులకు రూ. 31 వేలు హై స్కిల్డ్ (అధిక నైపుణ్యం గల) కార్మికులకు రూ. 36 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అసంఘటిత రంగ కార్మికుల హక్కులను ప్రభుత్వం కాపాడాలని, వారి సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించి తక్షణమే న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని బండారు దత్తాత్రేయ కోరారు.

## విజయలక్ష్మి నియామకం పట్ల మాల ఉద్యోగుల సంఘం హర్షం

**నాంపల్లి, మే 22 ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మిని, మరో ఆరుగురు సభ్యులను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడంపట్ల తెలంగాణ మాల ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తపరిచింది. తెలంగాణ ప్రజాప్రభుత్వం మహిళలకు ఎంతో సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ ఈ నియామకాలు చేపట్టినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన కుటుంబాలకు చెందిన మహిళలకు గుర్తింపు ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గద్వాల విజయలక్ష్మిని ఘనంగా సన్మానించి స్వీట్లు అందజేసి అభినందనలు చెప్పారు. అలాగే మంత్రి సీతక్క, జి.వివేక్ వెంకటస్వామి, ఎంపి బలరాంనాయక్‌లు సంఘం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో మహిళల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, మహిళలపై జరుగుతున్న అన్యాయాల నివారణలో మహిళా కమిషన్ మరింత చురుకుగా పనిచేయాలని తెలంగాణ మాల ఉద్యోగుల సంఘం జాతీయాధ్యక్షుడు బూరుగ విజయభాస్కరరావు కోరారు.



గద్వాల విజయలక్ష్మికి స్వీట్లు తినిపిస్తున్న మాల ఉద్యోగుల సంఘం సభ్యులు

## సైబర్ నేరాల అదుపునకు సహకరించాలి



ఏసీపీ రణవీర్ రెడ్డి ని సత్కరిస్తున్న ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గిడియన్ బాబు

**చిక్కడపల్లి, మే 22 ( ప్రభాతవార్త ) :**

ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా స్వచ్ఛంద సంస్థలు పోలీసులకు తమవంతు సహకారం అందించాలని చిక్కడపల్లి పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ జి. రణవీర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గిడియన్ బాబు ఆధ్వర్యంలో చిక్క డపల్లి ఏసీపీగా బాధ్యతలు తీసుకున్న రణవీర్ రెడ్డి ని మంగళవారం కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఏసీపీ రణవీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, స్వచ్ఛంద సంస్థలు తాము నిర్వహించే సేవా కార్యక్రమాలతోపాటు సైబర్ నేరాలు అరికట్టే విషయంలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వహించే పలు కార్యక్రమాలు ఏసీపీకి సంస్థ సభ్యులు వివరించారు. గిడియన్ బాబు మాట్లాడుతూ, ఫ్రెండ్లీ పోలీ సింగ్ ను పటిష్టంగా అమలు చేస్తూ సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.

## మంత్రులను కలిసిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సదాలక్ష్మి



**అత్తాపూర్ మే22 ,ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా ప్రభుత్వం తనను నియమించి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క లను ఏ సదాలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి వారిని సన్మానించారు. తాను పార్టీలో చేసిన సేవలను గుర్తించి మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమించటం ఎంతో సంతోషంగా ఉందని అందుకు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సదాలక్ష్మి మాట్లాడుతూ... రాష్ట్రంలో మహిళలకు అన్యాయాలు జరగకుండ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది అన్నారు. ఏ మహిళకు అన్యాయం జరగకుండా మహిళా కమిషన్ ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## భూకుంభకోణంపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పందించాలి

**-ఎమ్మెల్యేకు వాటా ఉందనిపిస్తుంది : తోకల శ్రీనివాస్ రెడ్డి**

**-రూ.1,000 కోట్ల భూకుంభకోణాన్ని లోతుగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి**

**అత్తాపూర్ మే22 ,ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం అక్రమార్కులకు అడ్డాగా మారిందని ప్రతి భూకబ్జాలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జి, మాజీ కార్పోరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం కాటేదాన్‌లోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిజెపి నేతలతో కలిసి తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు... నియోజకవర్గం అక్రమార్కులకు అడ్డాగా మారుతుంటే స్థానిక ఎమ్మెల్యే ఎం చేస్తున్నారని నాలుగోసారి ప్రజలు అవకాశం ఇచ్చారని కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ డమ్మీ ఎమ్మెల్యే అయ్యాడా.?లేదా అవినీతిలో వాటాదారుడుగా ఉన్నాడా ఎదోటి స్థానిక ప్రజలకు చెప్పాలన్నారు. సొసైటీకి సంబంధించిన వైస్ చైర్మన్‌గా ఉన్న ఓ వ్యక్తి ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుణ్నని చెప్పుకుంటూ అందరి అండదండలతో శంషాబాద్ మండలంలో వెయ్యి కోట్ల భూకబ్జా జరుగుతుంటే దినికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. పెద్దషాపూర్ గ్రామంలోని సర్వేనెంబర్ 172 నుంచి 180వరకు ఉన్న సర్వేనెంబర్లలో సుమారు 94 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం జరిగిందని అదేవిధంగా 176 ఎకరాలను కూడా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ఫైల్ సిద్ధం చేసినట్లు తెలుస్తుందన్నారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాలంటే కలెక్టర్ ద్వారా సిసిఎల్ఎకు పంపించి అనంతరం ప్రైవేట్ చేసే



అవకాశం ఉంటుందని కాని ఎటువంటివి సిసిఎల్ఏరే పంపించకుండా స్థానిక తహసీల్దార్‌నే సిసిఎల్ అధికారిగా మార్చుకుని ఆయన ద్వారా భూముల కట్టబెట్టడం జరిగిందని ఈ భూకుంభకోణంలో ఎవరి హస్తం ఉందో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలియజేయలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మూడు రోజులు ఎసిబి దాడులు జరిగిన దానికి సంబంధించిన వివరాలను ఎందు తెలియజేయడం లేదని ఎసిబి సోదాల తర్వాత భూకుంభకోణం బయటపడిందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉంది కబ్బటే విటిన్ని బయటకు రాన్వికుండా చేస్తుందని ఆరోపించారు. ప్రకాష్ గౌడ్‌కు సూటీగా చాలెంజ్ వేస్తున్న మీకు నిజంగా వాటా లేకపోతే స్పందించి బహిరంగంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ ప్రభుత్వం 1000కోట్ల భూకుంభకోణంలో ఎంఆర్‌ఓను బలిపశువును చేస్తున్నారని దిని వెనక ఉన్న పెద్ద తలకాయలను బయటకు తీసుకురావాలని న్యాయనిపుణుల కమిటీ వేసి పూర్తి స్థాయిలో విచారణ చేసి ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సంతోష్ గౌడ్ ,బొమ్మరాజు ,నరసింహ ,బుచ్చిరెడ్డి, వెంకటేష్ ,రాము, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా రిటైల్ అవుట్‌రీచ్ కార్యక్రమం

**సైఫాబాద్, మే 22 ప్రభాతవార్త:** గృహలక్ష్మి హౌసింగ్ రుణాలు, గోల్డ్ లోన్‌లు, వాహనాలకు లోన్లు వంటి వివిధ రిటైల్ రుణ పథకాల కింద బ్యాంక్ ప్రస్తుతం పోటీతత్వ ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందిస్తున్నదని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పోరేట్ ఆఫీస్ జనరల్ మేనేజర్ ఎ.డి.శ్రీనివాస్ చెప్పారు. సెంట్రల్ ఆఫ్ ఇండియా రీజియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడిక్కడ ఒక హోటల్‌లో మెగా రిటైల్ అవుట్ రిచ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎ.డి.శ్రీనివాస్, హైదరాబాద్ జోల్ హెడ్ ఎం.పిచ్చయ్య, హైదరాబాద్ రీజినల్ హెడ్ గజేంద్ర సింగ్ చౌహన్, సెలెక్ట్ కార్స్ సిఈఓ విజయ్ భాస్కరరాజు, హరిహర బిల్డర్స్ మేనేజింగ్ పార్టనర్స్ యు.గౌతమ్‌రెడ్డి, విలువైన కస్టమర్లు, బ్యాంక్ అధికారులు హాజరైనారు. ఈ సందర్భంగా ఎ.డి.శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంక్‌కు ఉన్న బలమైన (సిఎస్ఎ) బేస్ తగినంత నిధుల లభ్యత కారణంగా పరిశ్రమలోనే అత్యంత తక్కువ వడ్డీ రేట్లను బ్యాంకు అందిస్తోందన్నారు. జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ రీజినల్ హెడ్‌తో కలిసి ఈ ప్రాంతలోని రెండు శాఖల



కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ బ్యాంక్ అధికారులు

ను ప్రాంతీయ కార్యాలయంలో జనరల్ మేనేజర్ ఎన్‌పిఏ (ఎన్పీఏ) రుణగ్రహీతలతో సమావేశమై కొత్తగా జారీ అయిన ఖాతాలలో వారి ఖాతాలను అప్‌గ్రేడ్ చేయడం పాత ఖాతాలలో వన్-టైం సెటిల్‌మెంట్ కోసం చర్చలు జరిపారు. జైన్ బిల్డర్స్‌కు బిల్డర్ టై-అప్ కోసం ఒక సూత్రపాయ టై-అప్ లేఖను సెలెక్ట్ కార్స్, మాలిక్ ఆటో వరల్డ్, ప్రాస్పర్ కియా మోటార్స్‌కు వాహన డీలర్ టై-అప్‌ల కోసం సూత్రప్రాయ మంజూరు లేఖలను కూడా జారీ చేసింది.

## చిరువ్యాపారులకు అండగా ఉంటాం

**- మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్...**



టౌన్‌ప్లానింగ్ ఎ.సి.పి.కి వినతిపత్రం అందచేస్తున్న మాజీ కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్ తదితరులు

**బేగంబజార్, మే22ప్రభాతవార్త:**

బేగంబజార్ చేపలమార్కెట్ ప్రహరీ గోడకు అనుకుని చిరువ్యాపారుల షెడ్ల కూల్చివేసినయధాస్థానంలోనే చిరువ్యాపారుల షాపులను నిర్మించుకునే అనుమతి ఇవ్వాలని మహానగర పాలకసంస్థ బిజెపి ఫ్లోర్‌లీడర్ మాజీ కార్పొరేటర్ గొంటి శంకర్ యాదవ్ టౌన్‌ప్లానింగ్ ఎసిపికి విన్నవించారు. శుక్రవారం చిరువ్యాపారులు, బిజెపి నాయకులు ఎం.కృష్ణ, బేగంబజార్ డివిజన్ బిజెపి అధ్యక్షులు బండ క్రాంతికుమార్, శంకర్‌లాల్ యాదవ్‌లతోకలిసి జోనల్ కమీషనర్, డిప్యూటి కమీషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు వినతిపత్రాలను అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల మార్కెట్ ప్రహరీగోడ అనుకుని అన్ని అనుమతులతో నాలుగు సంవత్సరాల క్రితం షాపులను నిర్మించుకుని చిరువ్యాపారులు తమ వ్యాపారాలను చేసుకుంటున్నారు. ట్రాఫిక్ ఎలాంటిఇబ్బందులు కలుగకుండా వ్యాపారులు చేసుకుంటున్న షాపులను కూల్చివేసి వారిని రోడ్డు పాలు చేసినట్లు ఆరోపించారు. స్థానిక శాసనసభ్యులు టి.రాజాసింగ్ కూడా చిరువ్యాపారుల షాపులను కూల్చివేయడం పట్ల అధికారులపైమండిపడ్డారు15 రోజుల్లో నిరుపేదల చిరువ్యాపారులకు షాపులను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, వెంకటేష్‌యాదవ్, సుదీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సత్కారం**



చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్‌లను సత్కరిస్తున్న బ్రాహ్మణసంఘం రాష్ట్ర నేత నైషధం సత్యనారాయణ మూర్తి

**చిక్కడపల్లి మే 22 ( ప్రభాతవార్త) :**

తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్‌గా బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్‌లు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ప్రముఖ సంఘసేవకులు, చిక్కడపల్లి కి చెందిన బ్రాహ్మణసంఘం రాష్ట్ర నేత నైషధం సత్యనారాయణ మూర్తి శుక్రవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమాఖ్య కు చెందిన ప్రతినిధు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నైషధం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాడిన పరిషద్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సమాజానికి న్యాయం జరగాలని ఆకాంక్షించారు.

## నల్లకుంట శంకర్ మఠం ఆవరణలో మజ్జిగ పంపిణి

**చిక్కడపల్లి మే 22 ( ప్రభాతవార్త ) :** ప్రజలందరూ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి గందె సుధాకర్ అన్నారు. మంగళవారం హ్యాపీ వాకర్స్ క్లబ్, అవోపా హైదరాబాద్, గాయత్రి మహిళా వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నల్లకుంట శంకర్ మఠం ఆవరణలో ఏర్పాటు చేసిన కొర్ర ఉప్మా, అంబలి, రాస్నా, మజ్జిగ పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ వేసవికాలంలో దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు, క్లబ్‌లు సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ ఏ.రామలింగేశ్వర రావు, ఏరియా 3 ఉపాధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ, గాయత్రి మహిళా వాకర్స్ క్లబ్ ప్రధానకార్యదర్శి ఎస్.సుజాత, ఎన్.రాజశేఖర్, లింగాప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై బిజెపి నిరంతరం పోరాటం



**అత్తాపూర్ మే22,ప్రభాతవార్త :**

ప్రజాసమస్యలపై బిజెపి నిరంతరం పోరాటం చేస్తుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాటేదాన్‌లో డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్, డివిజన్‌కు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి కార్యాక్రమాలపై విస్తృంగా చర్చించారు. అనంతరం బిజెపి నేత మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ...డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని ముఖ్యంగా స్థానిక మౌలిక వసతులు, కాలనీల అభివృద్ధి, డ్రైనేజ్ సమస్యలు, తాగునీటి సమస్యలు మరియు ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలపై విస్తృతంగా పోరాటం చేయాలని పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కార్యకర్తల సమన్వయం మరియు రాబోయే కార్యక్రమాల విజయవంత నిర్వహణపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో అదికే రాజు , అడికే మహేందర్, బల్ల శ్రీనివాస్ యాదవ్, జి శ్రవణ్ కుమార్, గూడూరి అంజి , రామ కృష్ణ, జోగు నగేష్ , పి నందు , రవి కుమార్, సురేష్ యాదవ్ , సాయి కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ రాంనగర్ అధ్యక్షుడిగా అర్సలాన్ హుస్సేన్



అర్సలాన్ హుస్సేన్ కు నియామకపత్రాన్ని అందిస్తున్న రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్

**చిక్కడపల్లి మే 22 ( ప్రభాతవార్త ) :** కాంగ్రెస్ పార్టీ రాంనగర్ డివిజన్ కమిటి నూతన అధ్యక్షుడుగా సయ్యద్ అర్సలాన్ హుస్సేన్ నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్ కుమార్ యాదవ్ శుక్రవారం అర్సలాన్ హుస్సేన్ కు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ అనీల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలనీ సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించడానికి కృషి చేయాలని, అదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలన్నారు. కాగా రాంనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడుగా నియమితులైన సయ్యద్ అర్సలాన్ హుస్సేన్ మాట్లాడుతూ కార్యకర్తలతో మమేకమై స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించడం ద్వారా కాంగ్రెస్ పటిష్టత కోసం కృషి చేస్తానని చెప్పారు. డివిజన్ కమిటి అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనీల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దీపక్ జాన్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కల్పనా యాదవ్, పాశం అనీల్ కుమార్ యాదవ్, సయ్యద్ అంజద్ హుస్సేన్ లకు అర్సలాన్ హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు. పూర్తిస్థాయి డివిజన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకుని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిబద్ధతతో పని చేస్తామని చెప్పారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్



కంటోన్మెంట్ 4వ వార్డులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,మే 22 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం 4వ వార్డులోని విజయ్ నగర్ కాలనీ, ఆకుల నారాయణ కాలనీ, ఎం.ఎస్.కాలనీ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు,డ్రైనేజీ, మంచినీరు,విద్యుత్‌వంటి మౌళిక సదుపాయాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి రావడంతో వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బద్రినాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : ఆదం సంతోష్



సికింద్రాబాద్ జోనల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంతోష్ కుమార్

**అడ్డగుట్ట,మే 22 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కాంటెస్టెడ్ ఎమ్మెల్యే,కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్ కుమార్ జిహెచ్ఎంసి జోనల్ కమీషనర్ మంగ తయారుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో వివిధ వివిధ భాగాల అధికారులు,నియోజకవర్గంలోని ఆయా డివిజన్ల కాంగ్రెస్ నేతలతో కలిసి కో.. ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు,డ్రైనేజీ, పారిశుద్ధ్యం,వీధి దీపాలు, తాగునీటి వంటి సమస్యలు అస్తవ్యస్థంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అమె దృష్టికి తెచ్చారు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రజా సమస్యలు పరిష్కరించడంతో ఘోరంగా విఫలమైయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వివిధ విభాగాల అధికారులు పలు ప్రాంతాల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జలెందర్ రెడ్డి, గంట రాజు సాగర్, శిల్పా చారి, ఆర్.రాజేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారం : ఎమ్మెల్యే తలసాని



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్, మే 22 ప్రభాతవార్త:** డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఐడిహెచ్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన కాలనీలో 41 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న చిల్డ్రన్స్ ప్లే పార్క్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ముందుగా కాలనీలోని శివాలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. నిత్యం డ్రైనేజీ పొంగిపోతుందని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా కాలనీ మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నూతన లైన్ ఏర్పాటు తోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే గుర్తించారు. వెంటనే నూతన లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలోని పిల్లల ఆహ్లాదం కోసమే ప్లే పార్క్ ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కవాడిగూడ సర్కిల్ డీసీ పుష్పలత, వాటర్ వర్క్స్ ఏఈ శ్రీధర్, డీజీఎం వెంకట్ రెడ్డి, ఏఈ చంద్రశేఖర్, హార్టికల్చర్ అధికారి రాజిరెడ్డి, ఎలెక్ట్రికల్ ఏఈ రవి కుమార్, పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, లక్ష్మీపతి, ప్రేమ్, అంబులెన్స్ సురేష్, కుమార్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, లంక రాజు, వినోద్, అబ్బాస్ పాల్గొన్నారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి తదితరులు

**హైదరాబాద్, మే 22 ప్రభాతవార్త**

దేశంలో ఎక్కడలేని విధంగా కనీస వేతనాల పెంపు తెలంగాణ రాష్ట్రంలోనే జరిగిందని, కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి తెలిపారు. కనీస వేతనాల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ మొగుళ్ళ రాజిరెడ్డి నేతృత్వంలో ఐఎన్‌టీయూసీ నేతలు నాంపల్లి, గాంధీ భవన్ వద్ద శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు జి.సంజీవ రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్‌స్వామి, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని కోటి 11 లక్షల మంది కార్మికులకు కార్మికుల కనీస వేతనాలను పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమన్నారు. నగరాలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాలను పరిగణలోకి తీసుకుని నిర్ణయించిన ఈ కనీస వేతనాల పెంపుతో 9,37,455 సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 1,11,56,204 మంది కార్మికులకు లబ్ది చేకూరుతుందన్నారు. కనీస వేతనాల పెంపును గత బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ద్రవ్యోల్బణం, నిత్యవసర వస్తువుల పెరుగుదల, ఇంటి అద్దె వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని కార్మికుల శ్రేయస్సు కోసం తీర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామిలకు కనీస వేతనాలు పెంచినందుకు మొగుళ్ళ రాజిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదిల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి సందేశాత్మక నవలలు రావాలి : ఆచార్య వెలుదండ నిత్యానందరావు



తరంగి నవలను డా. కె.వి.రమణకు అంకితోత్సవం చేస్తున్న నిత్యానందరావు, రామకృష్ణారావు, వంశీరామరాజు, విహారి తదితర అతిథులు

**నాంపల్లి, మే 22 ప్రభాతవార్త :** సమాజానికి ముఖ్యంగా యువతకు మంచి సందేశాన్ని, ఉపయుక్తంగా ఉండే నవలలు రావాలని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. డా. వై.రామకృష్ణారావు రచించిన తరంగి నవల ఆకోవకు చెందిందేనని, ఆయన లోని ప్రతిభను గుర్తించే తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మక ప్రతిభా పురస్కారంతో సత్కరించడం జరిగిందని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాల గురించి చెప్పేవారే కరువవుతున్న నేటి దుస్థితిలో రామకృష్ణారావు కల్పితమైనా తనదైన ప్రత్యేకశైలిలో సులువుగా అర్థమయ్యేరీతిలో అద్భుతంగా రచించారని అన్నారు. తరంగి నవల ఆయన లోతైన అధ్యయానికి నిదర్శనమని ప్రశంసించారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సంస్థ స్వర్ణోత్సవాలు కన్నులపండువగా జరుపుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని డా. రాగిచెట్టు రంగారావు కళావేదికలో బహుగ్రంథకర్త విహారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెలుదండ నిత్యానందరావు ఆత్మీయ అతిథులు సుధామ, డా. ఆచార్య ఫణీంద్ర, పొత్తూరి సుబ్బారావు, వంశీ సంస్థల వ్యవస్థాపకుడు శిరోమణి డా. వంశీ రామరాజు తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారగ్రహీత డా. వై.రామకృష్ణారావు రచించిన తరంగి నవలను ఆవిష్కరించి తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణను ఘనంగా సత్కరించి తొలిప్రతిని ఆయనకు అందించి ఘనంగా అంకితోత్సవం కావించారు. ముందుగా శిరోమణి వంశీరామరాజు స్వాగతోపన్యాసంలో కార్యక్రమ నేపథ్యాన్ని విశదీకరించారు. అనంతరం రచయిత రామకృష్ణారావు దంపతులను రమణాచారి ఘనంగా సన్మానించారు.

## దుండిగల్ తండా-2లో డంపింగ్ యార్డ్, పవర్ ప్లాంట్‌పై ప్రజల ఆగ్రహం

**-ఆరోగ్య సమస్యలతో అల్లాడుతున్న తండా ప్రజలు..**

**-మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్**



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శంకర్ నాయక్

**దుండిగల్, మే 22, ప్రభాతవార్త**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ తండా2లో ఉన్న డంపింగ్ యార్డ్, పవర్ ప్లాంట్ కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ ఆరోపించారు. ఈ మేరకు దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. గత రెండు సంవత్సరాలుగా డంపింగ్ యార్డ్‌లో చెత్తను బహిరంగంగా వేయడం, అనంతరం మంటలు పెట్టడం వల్ల తండా మొత్తం పొగతో కమ్ముకుపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ సమస్యలు, మహిళల్లో గర్భసంచి సంబంధిత అనారోగ్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. బాధితులకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి కార్పొరేట్ వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గతంలో తండాలను మోడల్ కాలనీలుగా అభివృద్ధి చేస్తామని, డంపింగ్ యార్డ్ చుట్టూ ప్రహరీ నిర్మించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువుల తయారీ చేపడతామని అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం చెత్తను రోడ్లపై వేస్తూ తగులబెట్టడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. డంపింగ్ యార్డ్, పవర్ ప్లాంట్‌ను వెంటనే అక్కడి నుంచి తరలించాలని, తండాలోని రోడ్లను శుభ్రం చేసి చెత్తను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మూడు తండాల ప్రజలు కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ హెచ్చరించారు.

### కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాలకు టూర్ ప్యాకెజీ

**కంటోన్మెంట్, మే 22 ప్రభాతవార్త:** జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరం వద్ద సరస్వతి అంత్య పుష్కరాలు జరుగుతున్న సందర్భంగా ఆర్‌టీసీ రాణిగంజ్ డిపో టూర్ ప్యాకేజీ నడపడానికి నిర్ణయించింది. ఈనెల 23,24 తేదీలలో ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని, 40 మంది కలిసి బస్సును బుక్ చేసుకోవచ్చని డిపో మేనేజర్ ఏ.శ్రీధర్ తెలిపారు. బస్సు మీ కాలనీకే వస్తుందని తెలియజేశారు. టికెట్ ధర ఒక్కొక్కరికి రూ. 1400 ఉంటుందని తెలిపారు. బస్సు ఉదయం 5గంటలకు బయలుదేరి రాత్రి 11గంటలకు ప్రయాణం ముగుస్తుందని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవలని కోరారు.

### వృద్ధ తల్లిదండ్రులను వేధించిన నిందితుడికి జైలు శిక్ష

**సైఫాబాద్, మే 22 ప్రభాతవార్త:** వృద్ధులైన కన్నతల్లి దండ్రులను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్న నిందితుడికి రెండు నెలలు జైలు శిక్ష విధిస్తూ, 50 రూపాయలు జరినామా వేస్తూ న్యాయస్థానం తీర్పు నిచ్చింది. నారాయణగూడ పోలీస్‌లు కథనం ప్రకారం నారాయణగూడ పరిధికి చెందిన జి.శ్రీనివాస్ అనే వ్యక్తి తన వృద్ధ తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తూ, మానసిక ఆందోళనలకు గురిచేశాడని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి పూర్తి ఆధారాలతో నిందితుడిని 5వ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం.భాస్కర్ నిందితుడికి 60 రోజులు జైలు శిక్ష, 50 రూపాయలు జరినామా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా నారాయణగూడ పోలీసులు మాట్లాడుతూ తల్లిదండ్రులను వేధించేవారిపైన చట్టపరంగా కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సీనియర్ సిటిజన్ల భద్రతకు నారాయణగూడ పోలీసులు ఎల్లప్పుడు ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు.

### ప్రవీణ్‌కుమార్ తక్షణమే సిఎంకు, పోలీస్ యంత్రాంగానికి క్షమాపణ చెప్పాలి

**సైఫాబాద్, మే 22 ప్రభాతవార్త:** బండి భగీరథ కేసు విషయంలో సిఎం రేవంత్‌రెడ్డిని, పోలీస్ యంత్రాంగాన్ని అవమానపరుస్తూ మాట్లాడిని విశ్రాంత ఐపిఎస్ అధికారి ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ తక్షణమే సిఎంకు, పోలీస్ శాఖకు క్షమాపణలు చెప్పాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవని సతీష్‌మాదిగ డిమాండ్ చేశారు. ఒక మైనర్ బాలిక కేసు విషయంలో బండి భగీరధ్‌ను పోలీసులు అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించిన విషయం అందరికి తెలిసిందేనని, ఈ కేసు విషయంలో ప్రవీణ్‌కుమార్ పోలీస్ యంత్రాంగం పట్ల ప్రజల్లో చులకన భావన కలిగే వ్యాఖ్యలు చేశారని శుక్రవారం నాడిక్కడ మీడియా ఆయన సమావేశంలో ఆరోపించారు. తప్పు చేస్తే ఎంత టివారినైనా ప్రభుత్వం వదిలిపెట్టబోదనడానికి బండి భగీరథ్ అరెస్టు ఇందుకు నిదర్శనమన్నారు. ఈ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు ప్రవీణ్‌కుమార్‌కు, బిఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. ఫామ్ హౌజ్‌లో పడుకున్న వారికి కాపు కాస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను తెలంగాణ ప్రజల గమనిస్తున్నారని, ఆయన బిఎస్‌పిలో ఉన్నప్పుడు బిఆర్ఎస్ దొంగలు ఫోన్ ట్యాప్ చేశారని, బిఆర్ఎస్ నాయకులపై ఆనేక ఆరోపణలు చేసి నేడు ఆ నాయకులను వెనుకేసుకువస్తూ పోలీస్ యంత్రాంగాన్ని అవమానిస్తే ప్రజలు చెప్పులతో తగిన బుద్ది చెపుతారని సతీష్‌మాదిగ హెచ్చరించారు.

### కేసిఆర్ హయాంలోనే కళ్యాణ లక్ష్మీ పథకం : తలసాని

**అడ్డగుట్ట,మే 22 ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్ధికంగా చేయూత నందించాలన్న ఉద్దేశంతో తొలి ముఖ్య మంత్రి కేసిఆర్ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టారని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలో నివాసం ఉంటున్న 33 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు శేషుకుమారి, లక్ష్మి, బిఆర్ఎస్ నాయకులు బాల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి,అశోక్ యాదవ్,కరుణాకర్ రెడ్డి, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలి : మన్నెక్రిషాంక్



జె.ఎం.ఆర్.తో సమావేశమైన బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మన్నె క్రిషాంక్

**కంటోన్మెంట్,మే 22 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ అసెంబ్లీ బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి పార్టీకి మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు,నాయకులు వ్యక్తిగత విబేదాలు పక్కన పెట్టి పార్టీని బలోపేతం చేయాలని నియోజకవర్గం ఇన్‌ఛార్జి మన్నెక్రిషాంక్ తెలిపారు. శుక్రవారం బోయిన్‌పల్లిలో నివాసం ఉంటున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డితో బేటీ అయి పలు అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిపారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకు రావాలని, పార్టీ మెంబర్‌షిప్‌ను పెద్ద ఎత్తున నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ యువ నేతలు పాల్గొన్నారు.

### ఇండ్ల వద్దకే ఆసరా పెన్షన్‌దారుల లైవ్ వెరిఫికేషన్ : తహసీల్దార్



అడ్డగుట్టలో ఆసరా పెన్షన్ దారుల లైవ్ వెరిఫికేషన్ చేస్తున్న డి.టి.రాజు నాయక్

**కంటోన్మెంట్,మే 22 ప్రభాతవార్త:** మారేడ్‌పల్లి మండలంలో ఆసరా పెన్షన్లు తీసుకుంటున్న 12 వేల లబ్ధిదారులకు లైవ్ వెరిఫి కేషన్ చేసేందుకు ఆర్.ఐలే.తమ ఇండ్ల వద్దకు పంపిస్తున్నామని మారేడ్‌పల్లి తహశీల్దార్ అసదుల్లాఖాన్ తెలిపారు. శుక్రవారం అడ్డగుట్ట మారేడ్‌పల్లి వాల్మీకి నగర్,లాలాపేట్,శాంతి నగర్, లాలాగూడ ప్రాంతాల్లో ఆర్.ఐలు పెన్షన్ దారులు లైవ్ వెరిఫికేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే నెలలో పెన్షన్లు తీసుకోవాలంటే లైవ్ వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. అదే విధంగా అడ్డగుట్టలోని మారేడ్‌పల్లి తహశీల్ కార్యాలయంలో కూడా లైవ్ వెరిఫికేషన్ చేసుకోవచ్చన్నారు. పెన్షన్ దారులు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్‌కాపీలను తమ వెంట తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజు నాయక్,అర్.ఐలు దండి రాజు, శ్రవన్ గౌడ్,నరేశ్‌లు పాల్గొన్నారు.

### భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : శ్రీరాములు



బొల్లారంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సీనియర్ జర్నలిస్టు శ్రీరాములు

**కంటోన్మెంట్,మే 22 ప్రభాతవార్త:** అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహాను భావుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ అని సీనియర్ జర్నలిస్టు అస శ్రీరాములు తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కంటోన్మెంట్ బొల్లారంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దక్క భూమి పీఠభూమిలో అణగారిన హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన మహానుభావుడు భాగ్యరెడ్డి వర్మ అన్నారు. వారి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు సంజయ్,రాజు, పృథ్వీరాజ్, తులసీదాస్,ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప సంఘసంస్కర్త దళిత వైతాళికుడు మాదరి భాగ్యరెడ్డివర్మ



పి.ఎస్.అనంత్‌రాజ్‌ను భాగ్యరెడ్డివర్మ స్మారక జీవితసాఫల్య పురస్కారం-2026తో సత్కరిస్తున్న అతిథులు

**రవీంద్రభారతి, మే 22 ప్రభాతవార్త :** దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన మాదరి భాగ్యరెడ్డివర్మ గొప్ప సంఘ సంస్కర్త, ఆది ఆంధ్రసభ స్థాపకుడని సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి అన్నారు. హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి పునాదులు వేశాడని, జగన్మిత్రమండలి, మన్య సంఘం, సంఘసంస్కార నాటకమండలి, అహింసా సమాజంలను స్థాపించి హైదరాబాద్ ప్రాంతంలో సంఘ సంస్కరణలకై అహర్నిశలు కృషిచేశాడని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, షెడ్యూల్డు కులాల అభివృద్ధిశాఖ, ఆది హిందూ సోషల్ సర్వీస్‌లీగ్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శుక్రవారం రాత్రి ప్రభుత్వం అధికారికంగా మాదరి భాగ్యరెడ్డివర్మ 138వ జయంతోత్సవం ఘనంగా జరిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డా. రాహుల్ అమోలక్‌శాస్త్రి, కార్యదర్శి మాదరి అజయ్‌గౌతమ్, ఉపాధ్యక్షుడు నరసింహ, కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.బాలనరసింహ, కమిటీ సహాయ కార్యదర్శి మాదరి శ్రీలత గౌతమ్, కోశాధికారి జి.రేణుక తదితరులు పాల్గొని భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకుడు, సాంఘిక కార్యకర్త పి.ఎస్.అనంత్‌రాజ్‌ను ఘనంగా సత్కరించి భాగ్యరెడ్డివర్మ స్మారక జీవితసాఫల్య పురస్కారం-2026 ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు.

## ప్రజా ఆలోచన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల గోపాలరావు అస్తమయం..



ఉప్పల గోపాలరావు (ఫైల్ ఫోటో)

**కెపిహెచ్‌బి కాలనీ, మే 22, ప్రభాతవార్త**

ప్రజలకు అధికారులు జవాబుదారిగా పని చేయాలని కోరుకునే ఆలోచన దిగ్గజం, ప్రశ్నించే గొంతుక, ప్రజా ఆలోచన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల గోపాలరావు ఇకలేరు. ఆసియాలో అతిపెద్ద కాలనీగా పేరుందిన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని మలేషియన్ టౌన్ షిప్ (రెయిన్ ట్రీ పార్క్)లో నివాసం ఉంటున్న ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అనారోగ్యం కారణంగా ఇటీవల ఆసుపత్రిలో చేరిన ఉప్పల గోపాలరావు చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు అపోలో మెడికల్ కళాశాలకు అందజేశారు.గుంటూరు జిల్లా బ్రాహ్మణ కోడూరు గ్రామంలో ఉప్పల లక్ష్మీనారాయణ ఉదయ లక్ష్మీ దంపతులకు 1-3-1936న జన్మించారు. చిన్నప్పటినుండి సామాజిక స్పృహ గల విద్యార్థిగా ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. వ్యాపారం చేస్తే పదిమందికి మేలు చేకూర్చవచ్చనే ఉద్దేశంతో రైస్ మిల్ వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. మిర్యాలగూడలో మొట్ట మొదటి రైస్ మిల్‌ను స్థాపించారు. కష్టపడే వాడికి కమ్మనైన భోజనం దొరకాలి అన్న ఉద్దేశంతో 1976 సంవత్సరంలో ప్రజా ఆలోచన వేదికను ప్రారంభించారు. అప్పటి నుండి సమాజంలో నెలకొన్న అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నించడానికి ఎన్నో సభలు సమావేశాలు ఏర్పాటు చేశారు. సమాజంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా ప్రతినిధులను ప్రోత్సహించేవారు. సామాజిక స్పృహతో సమాజంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రజా సమస్యల కోసం అధికారులు జవాబుదారీగా ఉండాలని కోరేవారు. ప్రతి ఏడాది క్రమశిక్షణతో పని చేసే మున్సిపల్ సఫాయి కార్మికులను సన్మానించేవారు. ప్రతి ఏడాది ఉత్తమ విద్యార్థులకు నగదు వారితోషకం అందిం చి ప్రోత్సహించారు. తన జీవితమంతా పేద ప్రజల కోసం న్యాయం ధర్మం చట్టం పోరాటాలతో ప్రజల పక్షాన ఉన్న స్వర్గీయ ఉప్పల గోపాలరావు మరణా నంతరం సైతం తన ఇష్ట ప్రకారం తన పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు అందించాలని సూచించడంతో అంతిమ గడియలను సైతం సమాజానికి అంకితం చేయడం విశేషం.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి

**బోడుప్పల్ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లితండ్రుల విజ్ఞప్తి**

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** ప్రైవేట్ పాఠశాలలో పరిమితి లేని ఫీజుల వసూళ్లను నియంత్రించాలని బోడుప్పల్ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లి తండ్రులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ముఖ్యమంత్రికి, విద్యా శాఖ కార్యదర్శికి, మంత్రి శ్రీధర్‌బాబుకి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక చట్టం రూపొందించి, ఫీజుల నియంత్రణ చేస్తున్నారని, అదే విధంగా మన తెలంగాణ రాష్ట్రంలో కూడా ఫీజుల నియంత్రణ చట్టం అమలుచేయాలని కోరారు. పాఠశాలలు ప్రారంభం కాకముందు నుంచే పాఠశాలు బట్టల దుకాణాలు, బుక్ స్టాల్స్‌ను తలపించే విధంగా పాఠశాలలో వ్యాపారాలు చేస్తూ, విద్యార్థుల తల్లి తండ్రులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి, ప్రైవేట్ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచే ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, లేని పక్షం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి, ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రౌడీ షీటర్లపై పీడీ యాక్టు నమోదు



**చార్మినార్,మే 22 ప్రభాతవార్త :** నగరంలో వరుసగా తీవ్రమైన నేరాలకు పాల్పడుతూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఇద్దరు మోస్ట్ వాంటెడ్ రౌడీ షీటర్లపై హైదరాబాద్ నగర్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ ఆదేశాలు మేరకు రెయిన్ బజార్ పోలీసులు ప్రివెంటివ్ డిటెక్షన్ (పీడీ) యాక్టు కింద నిరోధక నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసి జైలుకు పంపించారు.ఈ మేరకు కేసు వివరాలను రెయిన్ బజార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చౌదరీ నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు.రెయిన్ బజార్ పోలీస్ స్టేషన్‌కు చెందిన రౌడీ షీటర్ ఓమర్ బిన్ హంజా అల్ జాబ్రీ, అలీ బిన్ మంజా అల్ జాబ్రీ అనే ఇద్దరు రౌడీషీటర్లు గత కొంత కాలంగా నగరంలో హత్యలు, హత్యాయత్నాలు,బలవంతపు వసూళ్లు,ప్రజలను ప్రాణాలతో తీస్తామని బెదిరించటం వంటి పలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.కాగా ఓమర్ బిన్ హంజా అలీ జాబ్రీపై నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎనిమిది కేసులు,నమోదు కాగా అలి బిన్ హంజా అల్ జాబ్రీపై ఏడు నేర పూరిత కేసులు నమోదయ్యాయి.ఇద్దరు రౌడీ షీటర్లపై పిడీ యాక్టు అస్త్రం ప్రయోగించాలని రెయిన్ బజార్ పోలీసులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. నేరాల తీవ్రతను క్షుణ్ణంగా పరిశీలించిన నగర పోలీస్ కమిషనర్ ఇద్దరు రౌడీ షీటర్లపై పీడీ యాక్టు కింద నిర్బంధ ఉత్తర్వులను జారీ చేశారని సిఐ చౌదరి నేతాజీ తెలిపారు.

### ఈ-పెట్టీ కేసులో రాపిడో డ్రైవర్‌కు జైలు

**చాంద్రాయణగుట్ట, మే 22, ప్రభాతవార్త :** ఈ-పెట్టీ కేసులో రాపిడో డ్రైవర్‌కు కోర్టు రెండు రోజుల జైలుశిక్ష విధించింది. చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి తెలిపిన వివరాల ప్రకారం... గుడిమల్కాపూర్‌కు చెందిన రాపిడో డ్రైవర్ మహ్మద్ రయీస్ ఖురేషీ (19) చాంద్రాయణగుట్ట ఎంబిఎన్‌ఆర్ చౌరస్తాలో అర్ధరాత్రి వేళ అనుమానస్పదంగా సంచరిస్తున్నాడు. గమనించిన పెట్రోలింగ్ సిబ్బంది అతనిని స్టేషన్‌కు తరలించి విచారించగా పొంతలేని సమాధానాలు ఇచ్చాడు. ఇప్పటికే అతనిపై గుడిమల్కాపూర్ పరిధిలో రెండు దొంగతనం కేసులున్నాయి. పోలీసులు రయీస్‌పై ఈ-పెట్టీ కేసు నమోదు చేసి నాంపల్లిలోని 9వ ఎస్.ఎం.ఎం.కోర్టులో హాజరు పరిచారు. కేసును విచారించిన మేజిస్ట్రేట్ పి.నర్సింగ్‌రావు నిందితుడు రయీస్ ఖురేషీకి రెండు రోజుల జైలుశిక్ష విధించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్‌రావు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## దోపిడీ కేసులో నిందితుడి అరెస్ట్..చోరీసొత్తు స్వాధీనం

**గోషామహల్,మే22ప్రభాతవార్త:** అత్యంత వేగంగా చేధించి నిందితుడిన్ని అదుపులోకి తీసుకుని చోరీ చేసి గొలుసునుగోషామహల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.గోషామహల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం. వివరాలను ఇలా ఉన్నాయి.చాక్నవాడి ప్రాంతానికి చెందిన రమేష్‌కుమావత్ ఈనెల 20వ తేదిన తన స్నేహితుడుధన్‌రాజ్ ఇంట్లో శుభ కార్యక్రమానికి హాజరై తిరిగి తన ద్విచక్రవాహనంపై వస్తుండగా జ్ఞాన్‌బాగ్ కాలనీ సమీపంలోనిఅంబా భవానీ టెంపుల్ సమీపానికి చేరుకోగా ఓ గుర్తు తెలియని వ్యక్తి తన మేడలోని బంగారు గొలుసును లాక్కునిఅక్కడి నుంచి ఉడాయించాడు.బాధితుడు గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని సిసిపుటేజ్‌ను పరిశీలించారు.పోలీసుల విచారణలో చందన్‌వాడి ప్రాంతానికి చెందినలాలాజీపవన్‌కుమార్ ఎలియాస్ సాయి,ఎలియాస్ దుర్లబ్‌ను గుర్తించి పోలీసులు ప్రత్యేక నిఘా వేసి పట్టుకున్నారు.అతని వద్ద ఉన్న 13గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును గోషామహల్ ఎసిపి కె.చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ బి.శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో డిటెక్టవ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ నాయక్ దర్యాప్తు చేస్తున్నారు.సకాలంలో కేసును చేధించిన క్రైం సిబ్బందిని డిసిపి జి.చంద్రమోహన్ అభినందించారు.

### ఎటిఎం నగదు తరలింపు వాహనంలో దొంగతనం..నిందితుడు అరెస్టు

**గన్‌ఫౌండ్రి,మే22ప్రభాతవార్త:** సంచలనం సృష్టించిన ఏ.టి.ఎం నగదు తరలింపు వాహనం దొంగతనం కేసునుసుల్తాన్‌బజార్ పోలీసులు అతి చాకచాక్యంగా చేధించి నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి సగభాగం నగదునుఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.క్యాస్‌కస్టోడియన్ క్లీయర్ సెక్యూర్టీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ గన్‌మెన్‌గా గడ్డం మల్లేష్,డ్రైవర్ షేక్‌రెహమాన్‌లతో కలిసి వైట్ కలర్ టయోటా ఇన్నోవా క్రిస్టా వాహనంలో వివిధ వ్యాపారుల సంస్థల నుండి నగదు వసూలు చేయడానికి బయలు దేరారు .సేకరించిన నగదును కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లోని ఎస్.బి.ఐ ప్రధానశాఖ నగదు డిపాజిట్ చేయడానికి చేరుకున్నారు.ఇద్దరు కస్టోడియన్లు నగదులో కొంతభాగాన్ని తీసుకుని బ్యాంకు లోపలికి వెళ్లారు.ఆసమయంలో వాహనంలో ఐదు బ్యాగుల లో 19లక్షల నగదుఉండగా అదే సమయంలో గన్‌మెన్ కూడా కాసేపు వాష్‌రూమ్‌కు వెళ్లడంతో వాహనం వద్ద ఎవరు లేకపోవడంతోగమనించిన డ్రైవర్ షేక్‌రెహమాన్ తక్షణమే ఆ నగదు వాహనంతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు.గన్‌మేన్‌గడ్డం మల్లేష్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని జరిగిన సంఘటన ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలించగా కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రి సమీపంలో వదిలివేయడం కనిపించదన్నారు.డూప్లికేట్ తాళంతో వాహనాన్నితెరిచి చూడగా నిందితుడి అందులోని రెండు నగదు బ్యాగులను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.ఇందులో5లక్షల88,932 కలిగిన డి-మార్ట్ నగదు.శ్యామ్‌సాంగ్ గెలాక్సి ఎం.31 మొబైల్ పోన్,టామీహిల్‌ఫిగర్,బ్లూకలర్ బ్యాగ్,ఇన్నోవా క్రిస్టా వాహనం తాళ్లం చెవ్వినితోపాటు స్వాధీనం చేసుకున్నారు.షేక్‌రెహమాన్‌ను కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును సుల్తాన్‌బజార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

నిట్ సం.11. పని పేరు : రాజేంద్రనగర్ జోన్, రాజేంద్రనగర్ సర్కిల్‌లో 27.05.2026న బక్రీద్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయుటకు 1 పని కొరకు ప్రమరణ. అంచనా మొత్తం/ECV: రూ.4.00 లక్షలు. డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది, సమయం, తేది: 22.05.2026 మ.2.30గం. బిడ్ స్వీకరణకు చివరి తేది, సమయం : తేది: 25.05.2026 మ.2.40గం.వద్ద. EE/SE పేరు, చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, GHMC. సెల్ నం: 9989930608. ఇ-మెయిల్ id-eec11.ghmc2@gmail.com

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, GHMC.

DIPR.NO. 2878-PP/CL/ADVT/1/2026-27 తేది: 22.05.2026


IN THE COURT OF THE HON'BLE 1ST ADDL JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT : AT: MEDCHAL

O.S. No. 198 OF 2026

**Between:**

1. Golla Anjaneyulu, S/o Late Golla Laxmaiah, Aged: 62 years, Occ: Private Employee, R/o.H.No.19-53, Giri Nagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District.
2. Gudoor Mamatha, W/o. G.Srikanth D/o G.Anjaneyulu, Aged: 37 years, Occ: House Wife, R/o. H.No.3-5-68, Veerabadhra Nagar, Near IB, Sangareddy, Medak District.
3. Golla Shiva, S/o. Golla Anjaneyulu, Aged: 32 years, Occ: Private Job, R/o.H.No. 19-53, Giri Nagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District.

...Plaintiffs

And

1.The Tahsildar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District.

2. All concerned.

...Defendants

To

The all Concerned

The above Original Suit has been filed by Golla Anjaneyulu and Another for Declaration of Legal Heirs against the defendants and the said suit stands posted to 10/6/2026 You i.e., Defendant No. 1 are therefore hereby directed to appear before the Hon'ble Court on 10/6/2026at 10.30 a.m. either in person or through Your Counsel/Advocate, failing which the matter will be decided by the Hon'ble Court in Your absence as per law.

//BY THE ORDER OF THE HON'BLE COURT//

Sd/- K.NAGENDER REDDY

Advocate

Address for service:

H.No.4-11, Bowrampet Village,, Gandimaisamma-Dundigal Mandal, Medchal-Malkajgiri District - 500 053.

Ph: 8801803707

## PUBLIC NOTICE

The General Public is hereby informed that my client Mr. GANTA VENU MADHAV, son of Late Mr. GANTA SREENIVASA RAO is intending to purchase the below mentioned Schedule Property from its inherited owners viz. Sri. S V B Venkata Ramana S/o Late Sri. Sanka Sambasiva Rao, Smt. K Annapurna D/o Late Sri. Sanka Sambasiva Rao, Smt. D Sarada D/o Late Sri. Sanka Sambasiva Rao, Sri. S N Sampath Kumar S/o Late Sri. Sanka Sambasiva Rao and Smt. S L Nalini D/o Late Sri. Sanka Sambasiva Rao, all Residents of Hyderabad.

If any person is having any objection, claim, interest, share, right, or charge over the said property, or objections in respect of the intended sale transaction, he/she/they may contact the undersigned with the documentary proof substantiating his/her/their objections/claims/details of dispute/s within Seven (7) days from the date of this publication, failing which, my client will proceed to complete the sale transaction with the above owners as if there are no third party claims/ objections/ disputes in respect of the Schedule Property and thereafter no claims/ objections/ disputes will be entertained.

**Schedule of Property:** All that the Residential House bearing Municipal Door No. 6-3-609/10/8 (PTIN: 1100607694) with a Plinth area of 928 Sq. feet (Ground Floor) admeasuring 260 Sq. yards or 217 Sq. Mtrs. situated at Anand Nagar Colony, Khairtabad, within the limits of GHMC, 35-Khairtabad Circle, Hyderabad, Telangana State., with boundaries as North: 36 Ft Road, South: Plot No. C-9/C, East: Neighbour's and West: Plot No. C-9/A

Sd/- Mr. T V SRIKANTH

Advocate

H No. 44, TRT Quarters, Seethaphalmandi, Secunderabad-61.

Cell: 9248096106

## సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి : లచ్చిరెడ్డి



సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ నూతన కమిటీ ప్రతినిధులతో లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం మే22,ప్రభాతవార్త**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నూతన కమిటీ ఏర్పరచుకున్న సందర్భంగా శుక్రవారంబి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి కాలనీ అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కాలనీ వాసులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షులు నూతన అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నీ ట్టు కృష్ణ, ఉపాధ్యక్షులు రంగాచార్యులు, వరప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, ట్రెజరర్ సుదర్శనం, సంయుక్త కార్యదర్శి కృష్ణారెడ్డి, రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపి, కార్యవర్గ సభ్యులు పాండు, జయరాజు, రాజు, రామచంద్ర మూర్తి, ఉమాశంకర్, ప్రవీణ్, మహేష్ మరియు తదితరులు ఉన్నారు.

## పూజ్యా మదారి భాగ్యరెడ్డి వర్మ సేవలు ఎనలేనివి : శ్యామ్ రావు



పూజ్య మదరి భాగ్యరెడ్డి వర్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శ్యామ్ రావు తదితరులు

**మలక్ పేట, మే 22, ప్రభాతవార్త:**

దివంగత పూజ్యా మదారి భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు ఎనలేనివని అంబేద్కర్, జగ్జీవన్ రామ్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్ రావు పేర్కొన్నారు. మదారి భాగ్యరెడ్డి వర్మ జయంతిని పురస్కరించుకుని శ్యామ్ రావు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్యామ్ రావు మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం మదారి భాగ్యరెడ్డి వర్మ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. అనంతయ్య, నర్సింగ్ రావు, స్వామి, బాల్ రాజ్ పాల్గొన్నారు.

## ఉజాలేష ఈద్గాలో ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేయాలి : ఎమ్మెల్యే బలాల



ఉజ లేష ఈద్గాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల , చిత్రంలో మాజీ కార్పొరేటర్ మీనాజ్ జలమండలి డిజిఎం హస్మత్ అలీ తదితరులు

**మలక్ పేట, మే 22, ప్రభాతవార్త:**

ప్రత్యేక ప్రార్థనల కోసం అక్బర్ బాగ్ లోని ఉజాలేష ఈద్గా లో అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని వివిధ శాఖల అధికారులు సిబ్బంది తో కలిసి ఉజాలేష ఈద్గా ను ఎమ్మెల్యే అహ్మద్ బలాల పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ప్రత్యేక ప్రార్థనల కొరకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మినాజ్, అధికారులు హస్మాత్ ఆలీ, వెంకన్న పాల్గొన్నారు.

## ధాన్యం, మొక్కల కొనుగోళ్లలో జాప్యం నివారించాలి: బిజెపి



వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు.

**హయత్ నగర్, మే 22 ప్రభాతవార్త :**

రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలులో జాప్యం, వసతుల లేమి, ఖితరుగుతేమఖి పేరుతో రైతుల దోపిడీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం హయత్ నగర్ తహసీల్దార్ కు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... కొనుగోలు కేంద్రాల్లో వేయింగ్ యంత్రాలు, గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి ప్రతి గింజనూ కొనాలన్నారు.తరుగు, తేమ పేరుతో కోతలు పెడుతున్న దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనాలన్నారు. ధాన్యం లిఫ్టింగ్ చేసిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరారు.కొనుగోలు కేంద్రాల్లో రైతు కన్నీళ్లు తుడవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని... . రైతు రోడ్డెక్కాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాయకులు బండారు భాస్కర్, కొప్పుల నరసింహారెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, గంగాని శ్రీనివాస్, హరీష్ రెడ్డి, కాటన్ క్రాంతి గౌడ్ పాల్గొన్నారు.

## హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి



హుక్కా వస్తువులు స్వాధీనం చేసుకుంటున్నా ఇన్స్పెక్టర్ సైదులు

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త:**

నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న హుక్కా సెంటర్ పై పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి ఎస్సై వెంకటయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అప్పిక్ కేఫ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో హుక్కా కుండా, హుక్కా ఫ్లేవర్ బాక్స్, సగం తాగిన రెండు బీరు సీసాలు పోలీసులకు లభ్యం కాగా వాటిని సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం కోలకొండ గ్రామానికి చెందిన నెమలి రాచమల్ల సంతోష్ (31) ఈ కేఫ్‌ను నడుపుతున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా కేఫ్‌లో హుక్కా కార్యకలాపాలు కొనసాగిస్తుండడంతో హుక్కా సామాగ్రిని స్వాధీనం చేసుకోవడంతో పాటు అతని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## అండర్‌పాస్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం. మే.22.ప్రభాతవార్త.**

చింతలకుంట అండర్‌పాస్ రోడ్డు మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతున్న నేపథ్యంలో ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.శుక్రవారం చింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్.బి.నగర్ జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఈ.ఈ.రోహిణి తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు నెలన్నర క్రితం తవ్విన రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అండర్‌పాస్ వద్ద సగం రోడ్డు మాత్రమే పూర్తి చేసి పనులను మధ్యలో నిలిపివేయడంతో హయత్‌నగర్, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. యూటర్న్ కోసం ఎల్.బి.నగర్ రింగ్ రోడ్డు వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో ప్రయాణ



చింతలకుంట అండర్ పాస్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సమయం పెరగడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా అధికమవుతున్నాయని తెలిపారు.ప్రతి రోజు వేలాది మంది ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చింతలకుంట అండర్‌పాస్ రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు.కార్యక్రమంలో భారస నాయకులు గండికోట శ్రీనాథ్, ఛాతిరి మధుసాగర్ పాల్గొన్నారు.

## రోజు రోజుకీ దారుణంగా మారుతున్న మూసీనది పరిస్థితి

**- ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు**

**-పట్టించుకోని సంబంధిత అధికారులు**

**మలక్ పేట, మే 22, ప్రభాతవార్త:**

మూసీ నది పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారుతుంది. మూసీ నది పరివాహక ప్రాంతం వెంబడి మట్టి దిబ్బలు, వ్యర్థాలను పడేయడంతో మట్టి దిబ్బలు, వ్యర్థాలు పేరుకుపోయి ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీంతో పలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులకు గురవుతూన్నామనీ మూసి పరిహార ప్రాంతంలోనీ స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. మూసి పరివాహక ప్రాంతంలో మట్టిదిబ్బలు, వ్యర్థాలు పేరుకుపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి కోసం మూసి రివర్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయమే అయినప్పటికీ, ప్రస్తుతం గ్రౌండ్ లెవెల్‌లో పరిస్థితులు మరింత దారుణంగా మారుతున్నాయని చాదర్‌ఘాట్ చిన్న బ్రిడ్జి సమీప ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల ప్రకారం, ఏడాది క్రితం తొలగించిన డెబ్రిస్ మరియు కూల్చివేత వ్యర్థాలను ఇప్పటికీ పూర్తిగా తొలగించకపోవడంతో మూసీ నది ప్రవాహం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తెల్లవారుజామున సమయంలో కొందరు వ్యక్తులు అక్కడే డంపింగ్ మెటీరియల్ వేస్తున్నారని ఆరోపిస్తున్నారు.అదే విధంగా రాత్రి వేళల్లో కొందరు మద్యం సేవిస్తూ అక్కడ గుమిగూడుతున్నారని, దీనివల్ల భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు భయాందోళనకు గురవుతున్నట్లు పేర్కొంటు



మట్టి దిబ్బలు, వ్యర్థాలతో పేరుకుపోయిన చాదర్ ఘాట్ మూసి పరివాహక ప్రాంతం దృశ్యం

న్నారు.కాలుష్యంతో నిండిన మురుగు నీటిలో పెరిగిన మొక్కలు దోమల పెరుగుదలకు కేంద్రంగా మారాయని, దీంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా చిన్నపిల్లలు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మూసి పరివాహక ప్రాంతంలో పేరుకుపోయిన పాత డెబ్రిస్, వ్యర్థాలను తొలగించాలని, మూసీ నది స్వేచ్ఛగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న శాశ్వత రక్షణ గోడను తక్షణమే నిర్మించాలని,రాత్రి వేళల్లో విజిలెన్స్ పెంచాలని, అక్రమ డంపింగ్, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలనిస్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అభివృద్ధి పనులు ఎంత ముఖ్యమో, ప్రజల ఆరోగ్యం మరియు భద్రత కూడా అంతే ముఖ్యమని స్థానికులు పేర్కొన్నారు వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విజయవంతానికి సహకరించాలి

**-అఖిలపక్ష నేతలను కోరిన బడంగ్‌పేట్ డిసి సమ్మయ్య**

**సరూర్‌నగర్, మే 22 ప్రభాతవార్త:** జీహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో చేపట్టే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని రాజకీయ పక్షాల నేతలు సహకరించాలని డిప్యూటీ కమీషనర్ వి.సమ్మయ్య కోరారు. వచ్చే నెల జూన్ 15వ తేదీ నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్ ప్రారంభంకానున్న నేపథ్యంలో శుక్రవారం బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో డిసి ఆధ్వర్యంలో అఖిల పక్ష నేతలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ తదితర పార్టీ నేతలకు డిప్యూటీ కమీషనర్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఉద్దేశ్యాలు, లక్ష్యాల గురించి తెలియజేశారు. ఎన్నికల ప్రక్రియలో ఈ కార్యక్రమం అత్యంత కీలకాంశమని ఆయన వెల్లడించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి పౌరుడి పేరు నమోదు కావడం అదే విధంగా ఏమైనా తప్పులు ఉన్న పక్షంలో వాటిని సరిచేయడం, మార్పులు, చేర్పులు చేపట్టడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని ఆయన వివరించారు. నిర్దేశిత సమయంలోగా ఈ కార్యక్రమాన్ని బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో పూర్తి చేయడానికి అన్ని పార్టీల వారు రాజకీయాలకతీతంగా సహకరించాలని ఆయన కోరారు. ప్రతిష్టాత్మకమైన ఈ కార్యక్రమం గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంలో రాజకీయా పార్టీల



అఖిలపక్ష నాయకులతో సమావేశమై ఎస్ఐఆర్ కార్యక్రమం గురించి వివరిస్తున్న బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య

పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు తమ తమ ప్రాంతాల్లో సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేటట్లు చేసి వారి వివరాలు సక్రమంగా అందించే విధంగా తోడ్పడి ఓటరు జాబితా తయారీ ప్రక్రియ సంపూర్ణంగా విజయవంతం కావడానికి సహకరించాలని సమ్మయ్య కోరారు. కాగా డిసి కోరిక మేరకు సర్కిల్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమం సజావుగా సాగి జయప్రదం కావడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పలువురు నేతలు హామీనిచ్చారు. ఈ సమావేశంలో అఖిల పక్ష నాయకులు అర్కల కామేష్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, తులసి ముఖేష్ ముదిరాజ్, రామిడి వీరకర్ణారెడ్డి, గిరి ముదిరాజ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో జన గణన ప్రక్రియ పరిశీలన

**సరూర్‌నగర్, మే 22 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్-16లో క్షేత్ర స్థాయిలో జరుగుతున్న జన గణన ప్రక్రియను శుక్రవారం డిప్యూటీ కమషనర్ వి.సమ్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సర్కిల్ కిందకు వచ్చే కుర్మల్‌గూడ పరిధిలోని ప్రాంతాల్లో పర్యటించి జన గణన విధులు నిర్వర్తిస్తున్న ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల పని తీరును పర్యవేక్షించారు. ఇందులో భాగంగా డిసి వారి నుండి జన గణన నమోదు ప్రక్రియలో భాగంగా ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అనే దానిపై ఆరా తీశారు. అదే విధంగా క్షేత్ర స్థాయిలో ప్రజల నుండి లభిస్తున్న సహకారం, సాంకేతిక అంశాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు సూచనలు, సలహాలు ఇచ్చి దిశా నిర్దేశనం చేశారు. జన గణన ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలనీ ప్రతి ఇంటికి సంబంధించి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓ ఒక్క ఇంటికి సంబంధించిన సమాచారం మిస్ కాకుండా చూడాలని అన్నారు. అనంతరం డిసి స్థానిక ప్రజలతో కూడా మాట్లాడి జన గణన ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వం చేపట్టే



కుర్మల్‌గూడలో జన గణన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల పని తీరును పరిశీలిస్తున్న డిప్యూటీ కమీషనర్

భవిష్యత్ ప్రణాళికలు, సంక్షేమ పథకాలు, కనీస సౌకర్యాలు, అభివృద్ధి, వనరుల గుర్తింపుకు జన గణన ఆధారంగా నిలుస్తుందని డిసి వెల్లడించారు. ముఖ్యంగా సమగ్ర జనాభా నిర్ధారణ, కుటుంబ వివరాలు, విద్య, ఉపాధి, నివాస పరిస్థితులు, సామాజిక, ఆర్థిక అంశాలకు సంబంధించి జన గణన ఉపకర్తిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు జన గణన సిబ్బందికి సక్రమమైన, సంపూర్ణమైన వాస్తవ సమాచారాన్ని తెలియజేయాలనీ అట్టి వివరాలను గోప్యంగా ఉంచబడుతుందని సమ్మయ్య స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎటువంటి సందేహాలు పెట్టుకోవద్దని ఆయన కోరారు. డిసి పరిశీలన కార్యక్రమంలో పలువురు అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## ఐఎస్ సదన్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కుంట సంతోష్‌కుమార్‌రెడ్డి

**సైదాబాద్, మే 22 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కుంట సంతోష్ కుమార్ రెడ్డి నియమితులైయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆయనకు నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా శుక్రవారం ఐఎస్ సదన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుంట సంతోష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, కార్యకర్తలతో కలిసి డివిజన్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు అహర్నిశలు శ్రమిస్తానని అన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కారానికి కట్టుబడి ఉంటానని తెలిపారు.తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ముఖ్య నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షునికి సన్మానం

**సరూర్‌నగర్, మే 22 ప్రభాతవార్త:** విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమితులైన విశ్వనాథుల యాదగిరి చారిని బహుజన సమాజ్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి కేతావత్ బహుగుణ ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన యాదగిరి చారి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విశ్వకర్మీయులు, మహాసభ నాయకులు శ్రీనివాసచారి, రవీంద్రచారి, యాదయయ, వాసుదేవ చారిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు , జరిమానా

**మలక్ పేట, మే22, ప్రభాతవార్త:**

పోక్సో కేసులో నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానాను కోర్టు విధించింది. 2024 జూన్ 7వ తేదీ రాత్రి 7 సంవత్సరాల బాలికకు చాక్లెట్లు కొనుక్కోవడానికి డబ్బులు ఇస్తానని చెప్పి బాలికను భవనంపై అంతస్తుకు తీసుకెళ్లి ఆసభ్యకరంగా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తుండగా బాలిక కేకలు వేసి అక్కడి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుంది. తల్లిదండ్రులకు విషయం తెలియజేయడంతో చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో చాదర్ ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కేసును విచారించిన పోక్సో కోర్టు 12వ అదనపు సెషన్స్ జడ్జి నిందితుడికి ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. పది వేల జరిమానాను విధించారు.

## కబడ్డీ, వాలీబాల్‌లో సత్తాచాటిన నాగోల్ విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ విజయకుమారి, కొలన్ ప్రభాకర్‌గౌడ్

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త:**

మేడ్చల్ మల్కాజ్గిరి డిస్టిక్ లెవెల్ కబడ్డీ, వాలీబాల్ పోటీలలో నాగోల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ సత్తాచాటారు. కబడ్డీలో మొదటి, వాలీబాల్‌లో ద్వితీయ బహుమతులను నాగోల్ విద్యార్థులకు కైవసం చేసుకున్నారు. కబడ్డీ మాజీ నేషనల్ ప్లేయర్ కోలన్ ప్రభాకర్‌గౌడ్, టిఆర్ఎస్ నాయకుడు కోలన్ చంద్రశేఖర్ ఆజాద్ ఆధ్వర్యంలో నాగోల్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పిఎంఎస్ఆర్ఐ జడ్పిహెచ్ఎస్ డిస్టిక్ కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో 40 టీంలు పాల్గొని పోటీపడ్డారు. కబడ్డీలో బాయ్స్, గర్ల్స్ పోటీలో పిఎంఎస్ఆర్ఐ జడ్పిహెచ్ఎస్ నాగోల్ విద్యార్థులు మొదటి బహుమతి, చౌదరిగుడా జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయ బహుమతి, వాలీబాల్ గర్ల్స్ పోటీలో విజేత టెక్నో స్కూల్, ద్వితీయ బహుమతి పిఎంఎస్ఆర్ఐ జడ్పిహెచ్ఎస్, వాలీబాల్ బాయ్స్ పోటీలో జెడ్‌పిహెచ్ఎస్ కుషాయిగూడ, ద్వితీయ బహుమతి జడ్పిహెచ్ఎస్ అదనపల్లి విద్యార్థులు సాధించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు మేడ్చల్ మల్కాజ్గిరి డీఈవో విజయకుమారి, కబడ్డీ మాజీ నేషనల్ ప్లేయర్ కోలన్ ప్రభాకర్‌గౌడ్, టిఆర్ఎస్ నాయకుడు కోలన్ చంద్రశేఖర్‌ఆజాద్ లు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. నేటి విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో బద్దం శ్రీధర్‌గౌడ్, బద్దం నరేందర్‌గౌడ్, రావుల రంజిత్‌గౌడ్, హరీష్, వి.మహేందర్ యాదవ్, నవీన్, శ్రీకాంత్, అక్షయ్ పాల్గొన్నారు.

## వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి : బిజెపి



అర్ఐకి వినతిపత్రం అంజేస్తున్న బీజేపి నాయకులు

**హుడాకాంప్లెక్స్,22 మే, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రైతు సమస్యపై సరూర్‌మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చెన్న కేశవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్పాల్ గౌడ్, గీతారెడ్డి, నరేష్ యాదవ్,గుండె కిరణ్‌కుమార్, మల్లేష్ గౌడ్, సిల్వర్ అనిల్, ప్రకాశ్‌గౌడ్, మల్కాజ్‌గిరి కుమార్, ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న లైవ్ అథెంటిఫికేషన్



పెన్షన్ దారులకు లైవ్ అథెంటిఫికేషన్ నిర్వహిస్తున్న అధికారులు

**హుడాకాంప్లెక్స్,22 మే, ప్రభాతవార్త :**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో చేయుత పథకం ద్వారా పించన్లు పొందుతున్న పెన్షన్ దారులకు లైవ్ అథెంటిఫికేషన్ నిర్వహించారు. సర్కిల్‌లోని వెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్లు, టాక్స్ ఇన్స్పెక్టర్లు పెన్షన్ దారులకు లైవ్ అథెంటిఫికేషన్ నిర్వహించారు.

## ప్రజలకు మరింత చేరువగా పాలన అందించాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ప్రజాపాలన జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కలెక్టర్ మనుచౌదరి తదితరులు

**ఉప్పల్, మే 22 ప్రభాతవార్త :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మనుచౌదరి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజా పాలనను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంపై చర్చించారు. ప్రజలకు మరింత చేరువగా పాలన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## మిథాని డిపో తెలంగాణ మజ్దూర్ యూనియన్ కమిటీ ఏర్పాటు



కమిటీ ఏర్పాటు సమావేశానికి హాజరైన యూనియన్ నాయకులు

**సరూర్‌నగర్, మే 22 ప్రభాతవార్త:** బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో మిథాని డిపోకు సంబంధించిన తెలంగాణ మజ్దూర్ యూనియన్ డిపో కమిటీని ఏర్పాటు చేశారు. తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కమలాకర్‌గౌడ్, జోనల్ కార్యదర్శి ఆర్ఎన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీకి అధ్యక్షునిగా పర్వతాలు నేత, కార్యదర్శిగా తిరుపతయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మజీద్, ముఖ్య ఉపాధ్యక్షులుగా ఐలయ్య, ఎస్ఎం రెడ్డి, ఉపాధ్యక్షునిగా చంద్రు, కోశాధికారిగా వెంకటయ్యగౌడ్, ముఖ్య సలహాదారునిగా స్వామిగౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌కు సంబంధించిన పలువురు డెలిగేట్లు పాల్గొన్నారు.

## రూ.కోటిన్నర వ్యయంతో అభివృద్ధి పనులు



కేటిఆర్‌నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 22 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని కేటిఆర్‌నగర్‌లో రూ.కోటిన్నర వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నారని, దశలవారిగా అన్ని పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి,ఉపాధ్యక్షుడు పి నరసింహ, కాంతారావు, నగేష్ ,శేఖర్, బాలు ,తిక్కారెడ్డి, శ్రీనివాస్, చందు, రాధ రేణుక పద్మ శారద ,వెంకటమ్మ, రేష్మ, ఉపేందర్‌రెడ్డి, రత్నా రెడ్డి, సత్తిరెడ్డి, రఘు, అలీం, సందీప్, భాస్కర్ పాల్గొన్నారు

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్ రెడ్డి

**సైదాబాద్, మే 22 ప్రభాతవార్త:**

స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా కుట్టు శిక్షణ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. చంపాపేట్ డివిజన్ పరిధిలోని మోడల్ మార్కెట్ భవనం వద్ద కమ్యూనిటీ హాల్ లో జయచంద్ర రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు కుట్టు యంత్రాల వినియోగం, వివిధ రకాల దుస్తుల కుట్టు విధానాలు, ఆధునిక డిజైనింగ్ పద్ధతులపై నిపుణులచే శిక్షణ ఇస్తారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ భారస పార్టీ యూత్ అధ్యక్షులు రవి ముదిరాజ్, ట్రైనర్ స్వయంప్రభ, రమాదేవి, ఉష,సంధ్య,ప్యారి, తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలి : చంద్రమోహన్



**తుర్కయంజాల్ మే 22, ప్రభాతవార్త**

సిఐటియు రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ రాగన్నగూడ పరిధిలో జిల్లా అధ్యక్షులు జాజాల రుద్ర కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ మాట్లాడుతూ..సిఎం రేవంత్ రెడ్డి షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ లో కనీస వేతనాల పెంపుదలను ప్రకటించారు. సుమారు 14 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో కనీస వేతనాలు సవరించడం ఆహ్వానించదగ్గ పరిణామం. 26 జూన్ నుండి రెండు వరకు సవరించిన వేతనాలు అమలు చేస్తామని ప్రకటించారు. కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు ప్రకటించిన వేతనాలు పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులు కార్మిక సంఘాలు చేసిన డిమాండ్ ను పట్టించుకోకపోవడం తీవ్ర అసంతృప్తిని కలిగిస్తుందని ముఖ్యమంత్రి వేతనాల పెంపుదల కోసం క్యాబినెట్ సబ్ కమిటీ వేశామని దేశానికి ఆదర్శంగా ఉండేలా శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాల పెంపుదల చేస్తామని ప్రకటించారు కానీ ఆచరణలో చూస్తే ముఖ్యమంత్రి ప్రకటించిన వేతనాల పెంపుదలలో శాస్త్రీయత లోపించిందని ఆశాస్త్రీయమైన పద్ధతిలో వేతనాల ప్రకటించారని అన్నారని పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సేమ్ టు యు రంగారెడ్డి జిల్లా కోశాధికారి ఈ కవిత ఉపాధ్యక్షుడు డి కిషన్, ఎస్ రామ్మోహన్, వై స్వప్న వీరయ్య జిల్లా సహాయ కార్యదర్శిలు ఆలేటి ఎల్లయ్య, పెంటయ్య, దేవేందర్, ఎల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు ఏర్పుల నరసింహ, టి నరసింహ, ఏం సత్యనారా యణ,పి జగన్, స్వామి, రాములు, కవిత, స్వప్న, నరహరి పాల్గొన్నారు

## హెచ్‌సిఎ అవినీతి అధికారులను వెంటనే అరెస్ట్ చేయాలి : ఏఐవైఎఫ్

**ఉప్పల్, మే 22 ప్రభాతవార్త :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో వెలుగులోకి వస్తున్న అవినీతి, అక్రమ ఆర్థిక లావాదేవీలు, టికెట్ బ్లాక్ మార్కెట్, క్రికెట్ పరిపాలనలో పారదర్శకత లేకపోవడం రాష్ట్ర ప్రజలను, క్రీడాభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సమితి ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ఆరోపించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ హెచ్‌సిఏలో 20 వేల విలువైన టికెట్ల వ్యవహారం కోట్ల రూపాయల అవినీతి దందాలకు దారితీసిందని, ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం, సామాన్య అభిమానులకు టికెట్లు అందకుండా మధ్యవర్తుల ద్వారా అధిక ధరలకు విక్రయించడం, ప్రభావశీల వర్గాలకు ప్రత్యేక కేటాయింపులు చేయడం వంటి ఆరోపణలు ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలని పేర్కొన్నారు. క్రీడలను అభివృద్ధి చేయాల్సిన సంస్థలు కొంతమంది అవినీతి వ్యక్తుల చేతుల్లో వ్యాపార కేంద్రాలుగా మారడం అత్యంత దురదృష్టకరమన్నారు.. స్థానిక యువ క్రీడాకారులకు అవకాశాలు కల్పించాల్సిన సంస్థలో లాబీయింగ్, డబ్బు, రాజకీయ ప్రభావం పెరగడం వల్ల నిజమైన ప్రతిభ వెలుగులోకి రావడం లేదని ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో జరిగిన అవినీతిపై రాష్ట్ర స్థాయి ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని, ఐపీఎల్ టికెట్ బ్లాక్ మార్కెట్ మరియు ఆర్థిక అక్రమాల్లో పాల్గొన్న అధికారులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అవినీతి అధికారులను కాపాడే ప్రయత్నం జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా యువజన ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.